నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది
చిన్నతనములోన మిన్నగా చరవాణి
పట్టబోకుమయ్య భవిత జెడును
మస్తకమును వంచి పుస్తకము చదువు
జ్ఞానమెంతొ కలిగి జ్ఞానియౌను
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్


తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ

- మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ చిత్రపటానికి నివాళులు

హైదరాబాద్:
నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని బుధవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పరామర్శించారు. దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఇటీవల మరణించగా హనుమకొండ జిల్లా కాజీపేట ప్రశాంత్ నగర్ సమీపంలోని పీజీఆర్ గార్డెన్‌లో మాతృ యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగారు. మంత్రి అనసూయ సీతక్క, ఎంపీలు పోరిక బలరాంనాయక్, -మిగతా 2 లో




# జూబ్లీహిల్స్ లో ఫైట్ స్టార్ట్

### మూడు పార్టీల నుంచి క్యాండిడేట్లు ఫైనల్

- నామినేషన్ వేసినా బీఆర్ఎస్ అభ్యర్థి సునీత..
- ప్రచారంలో కాంగ్రెస్ క్యాండిడేట్ నవీన్ యాదవ్
- బీజేపీ అభ్యర్థిగా లంకాల దీపక్ రెడ్డి ఫైనల్
- గెలుపు కోసం బస్తీల్లో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రులు
- బీసీలకు ఇవ్వలేదంటూ రాజాసింగ్ విమర్శలు

హైదరాబాద్:
జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం ఉపఎన్నిక రణరంగంగా మారింది. ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్ , కాంగ్రెస్ , భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంతో, ఇక్కడ రాజకీయ వేడి తారాస్థాయికి చేరుకుంది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో అనివార్యమైన ఈ ఉపఎన్నికలో విజయం సాధించడానికి మూడు పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి.
-మిగతా 2 లో



## ఉరితీతా..ప్రాణాంతక ఇంజక్షనా?

- మరణశిక్ష అమలులో పాతవిధానమే
- సుప్రీంకు కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ,
మరణ శిక్షఅమలు విధానాన్ని మార్చే ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దేశంలో మరణశిక్ష పడిన ఖైదీలకు ప్రస్తుతం అనుసరిస్తున్న ఉరితీత విధానాన్ని తొలగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై బుధవారం అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపింది. అయితే కేంద్‌రం ఇచ్చిన సమాధానంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కాలానుగుణంగా మార్పులను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ సమస్య అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా -మిగతా 2 లో



## మళ్లీ భగ్గుమన్న పాక్-అఫ్ఘాన్ సరిహద్దు

- కాందహార్‌లో పాక్ వైమానిక దాడులు
- 12మంది ఆఫ్ఘన్ పౌరులు మృతి

ఇస్లామాబాద్,
కాందహార్ ప్రావిన్స్‌లోని పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్ దళాలు జరిపిన వైమానిక దాడుల్లో 12మందికి పైగా ఆఫ్ఘన్ పౌరులు మృతి చెందినట్టు తెలుస్తోంది. ఇది తాలిబన్ - పాకిస్థాన్ దళాల మధ్య తాజాగా కాల్పులకు దారితీశాయి. దీంతో రెండు పాత మిత్రదేశాల మధ్య వైరం తీవ్రతరమైంది. దీనిపై ఇరుపక్షాలూ ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకున్నాయి. బుధవారం ఉదయం, కాందహార్‌లోని స్పిన్ బోల్డాక్ జిల్లాపై పాకిస్థాన్ దళాలు
-మిగతా 2 లో




## శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునుడిని దర్శించుకుంటా

- రూ.13, 400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఎక్స్ వేదికగా మోడీ తెలుగులో ట్వీట్

న్యూఢిల్లీ,
ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా లో గురువారం పర్యటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కర్నూలు జిల్లా పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ పెట్టారు. అచ్చమైన తెలుగులో ఈ ట్వీట్ పెట్టారు ప్రధాని మోదీ. ఆంధ్రప్రదేశ్‌లో 'రేపు అంటే అక్టోబర్ 16వ తేదీన పర్యటిస్తాను. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తాను. ఆ తర్వాత కర్నూలులో రూ.13, 400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు,
-మిగతా 2 లో

# నేను నా తోవ్వ వెతుక్కుంటున్నా

### జాగృతి జనం బాట చేపట్టిన కవిత




- ప్రజల వద్దకే వెళ్లి వారినే అడుగుతా
- ప్రజల్లో మమేకం కావడం ద్వారా దారివేస్తా
- పోస్టర్ ఆవిష్కరణలో సంచలన విషయాలు వెల్లడి

హైదరాబాద్,
జాగృతి జనం బాట పేరుతో కల్వకుంట్ల కవిత తెలంగాణలోని జిల్లాల్లో యాత్ర చేసేందుకు సిద్ధమయ్యారు. ఓ రకంగా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా జాగృతిని తీసుకుని వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. అలాగే ఇది బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా చేస్తున్న దండయాత్రగానే చూడాలి. ఈ సందర్భంగా బుధవారం నాడు యాత్రపై మీడియాతో కవిత మాట్లాడుతూ.. నాలుగు నెలల పాటు యాత్ర ఉంటుందని.. ప్రతి జిల్లాల్లో రెండు రోజులు ఉంటామన్నారు. జిల్లాల్లో ఉన్న అన్ని వర్గాల ప్రజలతో కలిసి మాట్లాడతామని చెప్పారు. జాగృతి జనం బాట పోస్టర్‌ను కవిత విడుదల -మిగతా 2 లో




## గూగుల్ రాకతో మారనున్న విశాఖ

- దీని పెట్టుబడులతో లక్ష మందికి పైగా ఉపాధి
- ఏఐకి సంబంధించి అనేక కంపెనీలు రాక
- చరిత్ర సృష్టించడం చంద్రబాబుకే సాధ్యం
- మీడియాతో ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి
గతంలో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ రూపురేఖలు మార్చిందని.. ఇప్పుడు గూగుల్ పెట్టుబడులతో విశాఖ రూపురేఖలు మారబోతున్నాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు.గూగుల్ పెట్టుబడితో లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయని అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం డేటా సెంటర్ మాత్రమే కాదు.. ఏఐకి సంబంధించిన అనేక కంపెనీలు విశాఖకు వస్తున్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయి. చరిత్ర సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా చంద్రబాబుతోనే
-మిగతా 2 లో




## మావోయిస్టులకు వరుస దెబ్బలు

- సీఎం ఫడ్నవీస్ ముందు లొంగిపోయిన మల్లోజుల
- అదే బాటలో తక్కళ్లపల్లి వాసుదేవరావు
- నేడు ఛత్తీస్ గడ్ సీఎం ముందు లొంగిపోతారని ప్రచారం
- సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్

నాగపూర్/హైదరాబాద్
ఏరివేత తప్పదు..లొంగిపోతే బతికిపోతారని కేంద్ర హోంమంత్రి హెచ్చిరికల నేపథ్యంలో మావోయిస్టులు భారీగా లొంపోతున్నారు. లొంగిపోయిన వారు బతికిపోతే..లొంగని వారు తూటలకు బలవుతున్నారు. వచ్చే మార్చిలోగా మావోలను అంతం చేస్తామని, ఆపరేషన్ కగార్ చేపట్టి వందలాది మందిని మట్టుపెట్టారు. ఈ క్రమంలో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయన ఆయుధాలు అప్పగించారు. ఇదిలావుంటే మావోయిస్టు పార్టీకి మరో బిగ్ షాక్ తగిలింది. మల్లోజుల బాటలో కీలక -మిగతా 2 లో

## కాంగ్రెస్ ప్రయత్నంతో రిజర్వేషన్లు రావు

- బీసీ ఐకాస ధర్నాకు సంపూర్ణ మద్దతు



- రేవంత్ ప్రయత్నాల్లో చిత్తశుద్ధి లేదు
- పార్లమెంటులో బిల్లు పెడితేనే సాధ్యం
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతోనే ఇది సాకారం
- కృష్ణయ్యకు స్పష్టం చేసిన కేటీఆర్

హైదరాబాద్,
బీసీ ఐకాస ధర్నాకు భారత రాష్ట్ర సమితి నైతిక మద్దతు ఉంటుందని కేటీఆర్ తెలిపారు. బీసీ–ఐకాస ఆధ్వర్యంలో 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆర్.కృష్ణయ్య, కమిటీ ప్రతినిధులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు బీసీల కోసం కేసీఆర్ ఎన్నో చేశారు. బీసీలకు లాభం జరగాలంటే పార్లమెంటులో బిల్లు చేయాలి.
-మిగతా 2 లో



## త్వరలో అక్రిడిటేషన్ పాలసీ

- జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్‌వో మల్సూర్ తో కలిసి అక్రిడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడేవిధంగా శాస్త్రీయ పద్ధతిలో అక్రిడిటేషన్ -మిగతా 2 లో

## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శ

(మొదటి తరువాయి)

డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, యశస్విని రెడ్డి, కే ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి రోడ్డు మార్గంలో పీజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ మాతృ యజ్ఞం కార్యక్రమంలో పాల్గొని కాంతమ్మ చిత్రపటం వద్ద పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకొని తిరిగి హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, నగర మేయర్ సుధారాణి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉరితీతా..ప్రాణాంతక ఇంజక్షనా?

(మొదటి తరువాయి)

దాఖలు చేశారు. కనీసం మరణశిక్ష పడిన ఖైదీకి.. ఉరితీతా? లేదా ప్రాణాంతక ఇంజెక్షనా? అని ఎంచుకునే అవకాశమైనా ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అమెరికాలోని 49 రాష్ట్రాలు మరణశిక్ష అమలులో ప్రాణాంతక ఇంజెక్షన్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. దీని వల్ల మరణ సమయంలో శిక్షపడ్డ నేరస్థుడికి తక్కువ వేదన ఉంటుందని ఇప్పటికే పలు అధ్యయనాల్లో తేలిందని పిటిషనర్ అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి దాన్ని పరిగణించేలా చూడాలని ప్రభుత్వం తరఫున వాదిస్తున్న న్యాయవాదికి సూచించారు. అయితే, పిటిషనర్ సూచన సాధ్యమయ్యేది కాదని.. దాన్ని ఇప్పటికే తమ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు కేంద్రం తరఫు కౌన్సిల్ కోర్టుకు వివరించింది. ఇది విధానపరమైన నిర్ణయమని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని గతంలో పరిశీలించినట్లు కోర్టుకు తెలిపారు. కేంద్రం సమాధానంపై ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. కాలానుగుణంగా ఎన్నో అంశాల్లో మార్పులు వచ్చాయి. కానీ, ప్రభుత్వం మాత్రం ఆ మార్పులను స్వీకరించేందుకు సిద్ధంగా లేదు. అదే ఇక్కడ సమస్యగా మారిందని వ్యాఖ్యానించింది. అయితే, ప్రస్తుతానికి దీనిపై తాము ఎలాంటి విధానపరమైన ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబరు 11వ తేదీకి వాయిదా వేసింది.

### శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునిడిని దర్శించుకుంటా

(మొదటి తరువాయి)

ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటాను. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతో పాటు మరిన్ని రంగాలకు సంబంధించినవి ఉన్నాయని ప్రధాని మోదీ తన ట్వీట్ ద్వారా వెల్లడించారు.

## మళ్లీ భగ్గుమన్న పాక్-అఫ్ఘాన్ సరిహద్దు

(మొదటి తరువాయి)

తేలికపాటి, భారీ ఆయుధాలతో దాడులు ప్రారంభించాయి. ఫలితంగా 12మందికి పైగా ఆఫ్ఘాన్ పౌరులు అమరులయ్యారు. కనీసం 100 మంది గాయపడ్డారని ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపారు. పాకిస్థాన్ చేసిన దాడి.. ఒక నివాస భవనాన్ని తాకడంతో ఆ ఇంట్లో చాలామంది పిల్లలు చనిపోయినట్టు తెలుస్తోంది. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆఫ్ఘన్ దళాలు కూడా ప్రతీకార చర్యకు దిగాయి. కాగా, పాకిస్థాన్ జరిపిన దాడిలో 15మంది పౌరులు మరణించారని ఒఈఖ వార్తా సంస్థ నివేదించింది. గాయపడిన వారిలో 80మందికి పైగా మహిళలు, పిల్లలు ఉన్నారని తెలిపింది. బుధవారం నాడు కాబూల్ శివార్లలో ఒక ఇంధన ట్యాంకర్ పేలింది. ఫలితంగా, భారీ అగ్నిప్రమాదం సంభవించిందని టోలోన్యూస్ నివేదించింది. వివాదం తగ్గే సూచనలు కనిపించకపోవడం, పాకిస్థాన్ మంత్రులను చర్చలకు ఆఫ్ఘనిస్తాన్ అనుమతించకపోవడంతో మధ్యవర్తులుగా వ్యవహరించడానికి ఖతార్, సౌదీ అరేబియాకు ఇస్లామాబాద్ ఫోన్ చేసినట్టు తెలుస్తోంది.

## త్వరలో అక్రిడిటేషన్ పాలసీ

(మొదటి తరువాయి)

పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈనెల చివరినాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కితీసుకురావాలని ఆదేశించారు.

## కాంగ్రెస్ ప్రయత్నంతో రిజర్వేషన్లు రావు

(మొదటి తరువాయి)

అసెంబ్లీలో చేసి నెపాన్ని ఇతరులపై నెట్టడం సమంజసం కాదు. బీసీల విషయంలో కాంగ్రెస్‌ది చిత్తశుద్ధి లేని శివపూజ. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు మాత్రమే సరిపోతాయా? రాజకీయ రిజర్వేషన్లతోపాటు అన్ని రకాలుగా మేలు జరగాలి. ధర్నాకు మద్దతు ఇస్తామంటున్న భాజపానే బిల్లు పెడితే అయిపోతుంది కదా అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం మాదిరే, సమస్యను ఢిల్లీ దాకా తీసుకువెళ్లి తెలంగాణ సాధించుకున్నట్లుగానే బీసీ రిజర్వేషన్లను సాధించుకుందాం. 18వ తేదీన బీసీ సంఘాలు నిర్వహించే బంద్‌కు మా పార్టీ మద్దతు ఇస్తుంది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రయత్నం మంచిది కాదు అని కేటీఆర్ హితవు పలికారు. పూటకో మాటతో బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. 2004లో ఆర్ కృష్ణయ్యను తీసుకొని ప్రధానమంత్రి దగ్గరకి వెళ్లి కేసీఆర్ మూడు విషయాలు చెప్పారు. ఒకటి దేశంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ పెట్టాలి, రెండు జనాభాకి అనుగుణంగా రాష్ట్రాలకు రిజర్వేషన్లు పెంచుకునే వెసులుబాటు కల్పించాలి, మూడు చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు కావాలని కేసీఆర్ అడిగారు. భారత దేశ స్థాయిలో ఈ మూడు అంశాల మీద మాట్లాడిన మొట్టమొదటి నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లపైన మా పార్టీ విధానాన్ని చాలా స్పష్టంగా మా పార్టీ చెప్పింది. గతంలో శాసనసభలో రెండుసార్లు రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి పంపించింది. కానీ కాంగ్రెస్ పార్టీ లెక్క ప్రచారం చేసుకోలేదు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా రిజర్వేషన్లు పెడతామని శాసనసభలో చెప్పినప్పుడు మేము ఆ పార్టీ తరఫున మద్దతు ఇచ్చాము. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు మంచిది కాదు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల పైన ఐదు రకాలుగా మాట్లాడుతోంది. రాజ్యాంగ సవరణ ద్వారా, పార్టీ తరఫున రిజర్వేషన్లు ఇస్తామని, ఆర్డినెన్స్ ద్వారా, బిల్లు ద్వారా, మరోసారి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాతనే బీసీ రిజర్వేషన్లు వస్తాయని చెప్పారు. ఇన్ని రకాలుగా మాటలు మార్చిన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని మేము తప్పకుండా ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ లో ఫైట్ స్టార్ట్

(మొదటి తరువాయి)

**ముగ్గురు కీలక అభ్యర్థులు ఖరారు**

**బీఆర్‌ఎస్ :** మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి బీఆర్‌ఎస్ తీవ్రంగా కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి, ఇతర కీలక నేతలు సునీత విజయం కోసం వ్యూహాలు రచిస్తున్నారు.

**కాంగ్రెస్ :** కాంగ్రెస్ పార్టీ తరఫున నవీన్ యాదవ్ ఎన్నికల బరిలో ఉన్నారు. యువ నాయకుడిగా, స్థానిక సమస్యలపై పోరాడే వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో ముమ్మర ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

**బీజేపీ :** భారతీయ జనతా పార్టీ లంకాల దీపక్ రెడ్డి పేరును ఖరారు చేసింది. గతంలోనూ జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసిన దీపక్ రెడ్డి, ఈసారి గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. పార్టీ పెద్దలు, రాష్ట్ర నాయకత్వం ఆయన గెలుపు కోసం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు.

**ప్రచారంలో దూకుడు పెంచిన కాంగ్రెస్, బీజేపీ**

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ప్రధానంగా నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రచారంలో వేగం పెంచారు. స్థానిక యువత, బస్తీ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. లంకాల దీపక్ రెడ్డి కూడా



కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ ఓటర్లను ఆకర్షించేందుకు కృషి చేస్తున్నారు.

**రాష్ట్ర మంత్రుల బస్తీ పర్యటనలు**

అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం రాష్ట్ర మంత్రులు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ముఖ్యంగా బస్తీ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ఓటర్ల అభ్యర్థులను, పార్టీ నాయకులను నేరుగా కలుపుతూ, ఉపఎన్నిక విజయం కోసం గట్టి పట్టుదలతో పనిచేస్తున్నారు. మంత్రుల ప్రచారం బీఆర్‌ఎస్ బలాన్ని పెంచేందుకు దోహదపడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**బీసీల రిజర్వేషన్లపై రాజాసింగ్ విమర్శలు**

ఈ ఉపఎన్నిక నేపథ్యంలో, బీసీ వర్గాలకు టికెట్ కేటాయింపు అంశం రాజకీయ చర్చకు దారితీసింది. బీజేపీ నాయకుడు రాజాసింగ్, ప్రధాన పార్టీలు బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని బహిరంగంగా విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీసీ జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, వారికి అవకాశం దక్కకపోవడంపై ఆయన నిరసన వ్యక్తం చేశారు. రాజాసింగ్ వ్యాఖ్యలు బీసీ ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విమర్శలు బీసీ వర్గాల మద్దతును తమవైపు తిప్పుకోవడానికి ప్రతిపక్షాలకు కొత్త అస్త్రంగా మారాయి.

**హోరాహోరీ పోరు అనివార్యం**

మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యురాలిగా సానుభూతి ఓట్లపై బీఆర్‌ఎస్ ఆశలు పెట్టుకోగా, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానిక నాయకుడిగా తన బలాన్ని నిరూపించుకోవాలని చూస్తున్నారు. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి, పార్టీ జాతీయ నాయకత్వం అండతో ముక్కోణపు పోటీలో విజయం సాధించాలని యత్నిస్తున్నారు. మొత్తం మీద, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మూడు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు అనివార్యం కానుంది. నియోజకవర్గంలో పోలింగ్ నవంబర్ 11న జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

# నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా

(మొదటి తరువాయి)

చేశారు. పోస్టర్‌పై తెలంగాణ తల్లి, జయశంకర్ ఫోటోలు ఉన్నాయి. కేసీఆర్ ఫోటో లేకుండానే కవిత పోస్టర్‌ను విడుదల చేశారు. అంతేకాకుండా కేసీఆర్ ఫోటో తీసేయడానికి కారణాలు కూడా కవిత మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. సామాజిక తెలంగాణ కోసం ఏం చేయాలనే విషయాలను ప్రజల నుండే తెలుసుకుంటామన్నారు. సామాజిక తెలంగాణ అంటే నినాదం కాదు విధానమని వివరించారు. తాము ఉన్నన్ని రోజులు సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే గురువులన్నారు. పెద్ద పెద్ద నాయకులను కూడా ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోపెట్టారని గుర్తుచేశారు. ప్రజల దగ్గరికి వెళ్ళి సమస్యలు తెలుసుకుంటామని కవిత అన్నారు. కేసీఆర్ ఫోటో లేకుండానే యాత్ర చేస్తామన్నారు కవిత. కేసీఆర్ లేకుండా తెలంగాణ రాలేదని.. అయితే కేసీఆర్ ఫోటో పెట్టుకుంటే నైతికంగా కరెక్ట్ కాదని చెప్పుకొచ్చారు. 'నేను నా తొవ్వ వెతుక్కుంటున్నా' అని అన్నారు కవిత. జాగృతి పెట్టినప్పుడు కూడా కేసీఆర్ ఫోటో పెట్టలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జాగృతి పెట్టినప్పుడు జయశంకర్ ఫోటో పెట్టామన్నారు. కేసీఆర్‌కు పుట్టడం తన అదృష్టమని.. 'మా దారులు వేరే అయినప్పుడు నా లైన్ నేను తీసుకోవడం కరెక్ట్' అని అన్నారు. కేసీఆర్ ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారని.. ఆ పార్టీ నుండి తనను సస్పెండ్ చేశారని తెలిపారు. నైతికంగా కరెక్ట్ కాదనే కేసీఆర్ ఫోటో తీసేస్తున్నట్లు వెల్లడించారు. దుర్మార్గుల నుంచి చెట్టును కాపాడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశానని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. జాగృతి మొదటి నుంచి స్వతంత్రంగా పని చేసిందని.. కేసీఆర్ నుంచి ఒక్క ఆలోచన తీసుకోలేదన్నారు. తాను బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత పార్టీతో జాగృతి అనుసంధానంగా పని చేసిందని వివరించారు. తన సస్పెన్షన్‌కు కారణాలను విశ్లేషించుకున్నానని తెలిపారు. పేగులు తెగేదాక తెలంగాణ కోసం కోట్లాడానని అన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నామని..సామాజిక తెలంగాణ సాధించుకోలేక పోయామని వ్యాఖ్యలు చేశారు. సామాజిక తెలంగాణ కోసం మాట్లాడడం తప్పా అని ప్రశ్నించారు. ఏదో తప్పు మాట్లాడినట్టు చూపించి కుట్ర చేసి బయటకి పంపారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్న రంగం లేదన్నారు. అనేక సమస్యలు తెలంగాణను పట్టి పీడిస్తున్నాయన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారాన్ని పక్కన పెట్టి ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్క రూపాయి కూడా తేలేకపోతున్నారని విమర్శించారు. పది సంవత్సరాల్లో తెచ్చిన ఫలితాలు ఇప్పుడు అందడం లేదని కవిత వ్యాఖ్యలు చేశారు. 'పార్టీ వద్దనుకున్నాక పదవి ఎందుకు. చాలా క్లారిటీతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశా. రాజీనామా చేసిన తర్వాత కూడా ఆమోదించడం లేదు. రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్ రాజకీయం ఏంటో? పార్టీ పెట్టాలో లేదో ఇప్పటికీ క్లారిటీ లేదు. ప్రజలతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటాను. ప్రజలే గురువులు. కాబట్టి ఏం చేయాలో వారినే అడుగుతా. కేసీఆర్‌కు మచ్చ రాకుండా ఉండాలనే ప్రయత్నం చేశాను. కానీ నన్ను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దారులు వేసినప్పుడు ధైర్యం ఉండాలి. బనకచర్ల, గోదావరి జలాలు లాంటి అన్ని అంశాలను మాట్లాడుతాం. యూరియా నుండి బస్సుల దాకా అన్ని రంగాల్లో సమస్యలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ చిన్న విషయం. ఉపఎన్నికతో జాగృతికి సంబంధం లేదు' అని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# గూగుల్ రాకతో మారనున్న విశాఖ

(మొదటి తరువాయి)

సాధ్యం. ఆనాడు కియా ఏర్పాటుతో చరిత్ర సృష్టించాం. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెడుతోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అతిపెద్ద విజయం. నవంబర్‌లో మరిన్ని శుభవార్తలు ఉంటాయి. వైకాపా పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. డేటా సెంటర్ అంటే ఏంటో గతంలో పనిచేసిన మంత్రికి తెలుసా? నవంబర్ నుంచి విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు 13 పైసలు తగ్గేలా చర్యలు తీసుకుంటాం అని నారా లోకేశ్ తెలిపారు. సెప్టెంబర్ 2024లో గూగుల్ ప్రతినిధులు విశాఖ వచ్చినప్పుడు వారితో సమావేశమయ్యాను. వారికి డేటా సెంటర్ స్థలాన్ని చూపించాం. ఇది జరిగిన నెల రోజుల్లో యూఎస్ వెళ్లి గూగుల్ క్లౌడ్ నాయకత్వాన్ని కలిశా. నవంబర్‌లో గూగుల్ ప్రతినిధులు సీఎంను కలిశారు. ఇదే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు అనేకసార్లు భేటీ అయ్యారు. అనేక చర్చల తర్వాత ఇంత పెద్ద పెట్టుబడి సాధ్యమైంది. భారీ పెట్టుబడులపై అన్ని చోట్లా చర్చలు జరుగుతున్నాయన్నారు. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం. అనంతపురం, కర్నూలుకు పంప్డ్ స్టోరేజ్, సిమెంట్ ఫ్యాక్టరీలు వస్తున్నాయి. చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఎకో సిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం. శ్రీసిటీ గ్రేటర్ ఎకోసిస్టమ్‌లో అనేక పెట్టుబడులు తీసుకొస్తున్నాం. డైకెన్, బ్లూస్టార్, ఎల్జీ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోంది. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ తీసుకొస్తున్నాం. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వాను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. ఉత్తరాంధ్రలో టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. అన్ని ప్రాంతాలను సమగ్ర అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం అని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. ఎంవోయూలపై సంతకాలు కాదు.. ఆచరణలో చేసి చూపిస్తున్నాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నాం. ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని ఛాలెంజ్‌గా తీసుకున్నాం. ఏ ఒక్క కంపెనీ కూడా మన రాష్ట్రం నుంచి వెళ్లే పరిస్థితి రాదు. గత ఐదేళ్లలో ఏపీలో విధ్వంసం జరిగింది. అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్లు ఉన్నాయి.. ఏపీలో మాత్రం డబుల్ ఇంజిన్ బులెట్ ట్రైన్ ఉంది. దిల్లీలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం చంద్రబాబు కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు.

# మావోయిస్టులకు వరుస దెబ్బలు

(మొదటి తరువాయి)

నేతలు నడిచేందుకు సిద్ధమయ్యారు. మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు రెడీ అయ్యారు. గురువారం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ముందు ఆశన్న లొంగిపోనున్నారని సమాచారం. ఆయనతో పాటు మరో 70 మంది మావోయిస్టులు కూడా సీఎం ముందు జనజీవన స్రవంతిలో కలవనున్నారు. బుధవారం ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో 27 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రకటించారు. వీరిపై రూ.50లక్షల రివార్డు ఉంది. సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో ఈ మేరకు మల్లోజులను పోలీసులు మీడియా ముందుకు తీసుకొచ్చారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయన ఆయుధాలు అప్పగించారు. ఈ రెండు షాకులతో మావోస్టులు అల్లాడుతుంటే.. తాజాగా ఆశన్న లొంగిపోతున్నారనే వార్త.. వారికి మరో దెబ్బ తగినట్లే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత, దాదాపు రెండో స్థానంలో చలామణి అవుతున్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి బుధవారం ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట అధికారికంగా లొంగిపోయారు. సీఎం సమక్షంలో వీరంతా తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మల్లోజుల, ఆయన బృందాన్ని సీఎం ఫడణవీస్ జన జీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. తీవ్ర ఒడిదొడుకులతో సాయుధ ఉద్యమం బలహీనపడుతోందన్న ప్రచారం నేపథ్యంలో మావోయిస్టు పార్టీకి ఇది ఇబ్బందికర పరిణామంగా గమనించాలి. మావోయిస్టు పార్టీ వైఖరి సరిగా లేదంటూ కొన్ని రోజులుగా మల్లోజుల బహిరంగ లేఖలు రాస్తున్న సంగతి తెలిసిందే.

## 2025 అక్టోబర్ 16, గురువారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
ఆశ్వయుజ మాసం
కృష్ణ పక్షం
తిథి
నవమి: అక్టోబర్ 15 ఉదయం 11:08
అక్టోబర్ 16 ఉదయం 11:37 వరకు
దశమి: అక్టోబర్ 16 ఉదయం 11:37
అక్టోబర్ 17 ఉదయం 12:26 వరకు
నక్షత్రం
పుష్యమి: అక్టోబర్ 15 ఉదయం 11:08
అక్టోబర్ 16 మధ్యాహ్నం 1:13 వరకు
ఆశ్లేష: అక్టోబర్ 16 మధ్యాహ్నం 1:13
అక్టోబర్ 17 మధ్యాహ్నం 3:30 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:39 - 5:24
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:40- 12:25
అమృతకాలం: రాత్రి 11:05 - 12:42
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 1:30 -3:00 మధ్యాహ్నం
యమగండం: ఉదయం 6:11 - 7:39
గుళికా: ఉదయం 9:07 - 10:35
దుర్ముహూర్తం: ఉదయం 10:08 - 10:56, మధ్యాహ్నం 2:50 - 3:38
వర్జ్యం: రాత్రి 10:21- 12:01

# సబ్‌స్టేషన్ స్థలపరిశీలన చేసినఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండల పరిధిలోని మొల్కమామిడి గ్రామ సమీపంలో ప్రతిపాదిత 220/33 కేవీ నూతన సబ్‌స్టేషన్ స్థలాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ఎమ్మార్వో, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అమ్రాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు హరి నారాయణ గౌడ్, అచ్చంపేట తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల రాజగోపాల్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బాలలింగం గౌడ్, రెన్నయ్య, సంతు, ముక్రం, మనోహర్, గౌస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు గ్రామంలో శివలింగ ధ్వంసం తీవ్ర నిరసన వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్

❖దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**తెలకపల్లి, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలకపల్లి మండల పరిధిలోని ఆలేరు గ్రామంలో శివలింగాన్ని ధ్వంసం చేసిన ఘటనపై హిందూ సంఘాలు, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. గ్రామానికి చేరుకుని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ మాట్లాడుతూఇలాంటి సంఘటనలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, నిందితులు ఎవరికైనా, ఏ మతానికి చెందిన వారైనా చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. హిందువులు ఒకే తాటిపై ఉండి గుళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. దేశంలో అన్ని మతాలవారు ప్రశాంతంగా జీవిస్తున్నారని, కొంతమంది కావాలని శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. దేవాలయాలపై దాడులు సహించబోమని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి శివలింగాన్ని తిరిగి ప్రతిష్టించాలని, తాను సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు మాట్లాడుతూ హిందువులు కేవలం ఓటు బ్యాంకు రాజకీయంగా కాకుండా అన్ని పార్టీల్లో ఉన్నవారిగా గుర్తించాలన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి దేవాలయాల రక్షణకు అందరూ ఏకతాటిపై ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఈశ్వరయ్య, శ్రీను, కృష్ణ, రవి, రవీందర్ రావు, నారాయణ రెడ్డి, నాగేందర్ గౌడ్, సుధాకర్ రెడ్డి, బాబు, సాగర్, కృష్ణయ్య, శివయ్య, గౌడ్, రాజవర్ధన్ రెడ్డి, వెంకటేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్‌లో ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్‌కు భూ పరిశీలన

❖ఆయుర్వేద్ అధికారులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ఘన స్వాగతం



**అమ్రాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లమల అడవిలోని అమ్రాబాద్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఆయుర్వేద్ మెడికల్ కాలేజ్ రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి అవసరమైన భూ పరిశీలన కోసం ఆయుష్ శాఖ అధికారులు అమ్రాబాద్ పర్యటనకు వచ్చారు. ఆర్డిడి మల్టిజోన్ -2 అధికారి డాక్టర్ రవి నాయక్, ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ బిఆర్ కేఆర్, ఆయుష్ మోడల్ అధికారి డాక్టర్ భూపాల్ నాయక్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ సురేష్ ని ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్వాగతం పలికారు.ఆయుర్వేద్ రంగంలో అభివృద్ధికి ఇది కీలకమైన అడుగుగా భావిస్తున్నారు.

## జస్టిస్ బి.ఆర్. గవాయి పై దాడి రాజ్యాంగంపై దాడిగా అభివర్ణన -దళిత జేఏసీ



**కరీంనగర్, అక్టోబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడికి పాల్పడిన వ్యక్తిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రముఖ సీనియర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం దళిత జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఖజురహో దేవాలయాల కేసు విచారణ సమయంలో న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని, దీనిపై ఆయన వివరణ కూడా ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ, రాకేష్ కిషోర్ అనే న్యాయవాది బూటు విసిరిన ఘటనను వ్యక్తిగత దాడిగా కాకుండా రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. ఈ చర్య జుడీషియల్ వ్యవస్థ, ప్రజాస్వామ్యం, దళితుల ఆత్మాభిమానంపై దాడిగా పేర్కొన్నారు. 20 రోజులుగా కుట్ర పన్నిన శక్తులే దీనికి కారణమని ఆరోపించారు. పదవీ విరమణకు ముందు న్యాయమూర్తిని తప్పుగా చూపే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు రాజ్యాంగ వ్యతిరేక శక్తుల దాడిని తిప్పికొట్టేందుకు దళిత వర్గాలు, ప్రజాస్వామిక వాదులు, బడుగు బలహీన వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అధర్మం నశించి రాజ్యాంగం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ నిరసన దీక్షలో జేఏసీ నాయకులు నల్లాల కనకరాజు, బోయినిపల్లి చంద్రయ్య, కడపల విజయ్‌కుమార్, మరె రాజేందర్, గొర్రె రాజయ్య, సుతారి లచ్చన్న, గండి రాజేశ్వర్, ఉరుమల్ల విశ్వం, బాబుల్ వర్మ, సొల్లు బాబు, శుక్రుద్దీన్, గంటల రేణుక, మార్వాడి సుదర్శన్, మేడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ



**ఉప్పునుంతల, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వ్యాధి నివారణ టీకాల అవసరాన్ని వివరించారు. పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థిక భద్రతకు మూలమని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు వెంకటేష్, ప్రవీణ్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ నరసింహారెడ్డి, మాజీ సర్పంచి గోవర్ధన్, దేవాలయ చైర్మన్ వేముల నరసింహారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్లకు నూతన డ్రెస్ కోడ్ వస్త్రాల పంపిణీ


❖ అంగన్వాడి భవనాల అభివృద్ధికి కృషి చేస్తా అన్న ఎమ్మెల్యే విజయరమణ రావు



**ఎలిగేడు, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు బుధవారం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన 305 మంది అంగన్వాడి టీచర్లకు, ఆయాలకు నూతన డ్రెస్ కోడ్ వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడి భవనాల సమస్యలు ఉన్నాయని, పిల్లల పట్ల టీచర్లు, ఆయాలు తల్లిలా అంకితభావంతో సేవలందిస్తున్నారని ప్రశంసించారు. నర్సరీ విద్యతో పాటు పోషకాహార పదార్థాల పంపిణీ, ఆన్లైన్ ద్వారా వివరాల నమోదు వంటి అంశాల్లో ప్రభుత్వం పారదర్శకత పాటిస్తున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొత్త డ్రెస్ కోడ్ వస్త్రాలను అందిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిడిపిఓ కవిత, ఏసిడిపిఓ సంపద, సూపర్వైజర్ సూర్యకళ, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## తెలంగాణ బంద్ విజయవంతం చేయాలని బీసీ సంఘాల పిలుపు

❖ మిర్యాలగూడలో గోడపత్రిక ఆవిష్కరణ



**మిర్యాలగూడ, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ బంద్‌కు మద్దతుగా మిర్యాలగూడ అమరవీరుల స్తూపం వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బందును విజయవంతం చేయాలని బీసీ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ బీసీ సంఘం జేఏసీ చైర్మన్‌గా గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్, బీసీ యువజన విద్యార్థి సంఘం చైర్మన్‌గా గాధగోని మహేష్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో కన్వీనర్స్‌గా రాజు, బంటు, వెంకటేశ్వర్లు, మురళి యాదవ్, దుర్గయ్య, గౌరవ సలహాదారులుగా నాగేందర్, రామకృష్ణ, మహిళా అధ్యక్షురాలిగా జయమ్మ, సావిత్రి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు సురేష్ యాదవ్, అశోక్ చారి, శరత్ నాయి, బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కృష్ణ, ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు రాజు, ప్రజాసేవ అధ్యక్షుడు మనీ, నిరుద్యోగ యువత ప్రతినిధులు కృష్ణ రాజు, అనిల్, భీమరాజు, జ్యోతి, రమేష్, కిష్ట రాజు, నరేందర్, నరేష్, శంకర్, మంజుల, రామకృష్ణ, భవాని, రాణి, సరిత, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ఫార్చ్యూన్ బటర్ ఫ్లయ్ పాఠశాలలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



**కడ్తాల్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని బుధవారం కడ్తాల్ పట్టణ శివారులోని ఫార్చ్యూన్ బటర్ ఫ్లయ్ పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పాఠశాల వ్యవస్థాపకులు శేషగిరి రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహా వ్యవస్థాపకులు రమేష్, ప్రిన్సిపల్ డాక్టర్ సంజీవ్ నాంపల్లి, వైస్ ప్రిన్సిపల్ రంగారావు, కోఆర్డినేటర్లు శిరీష, ప్రియాంక, జోసెఫ్, రవికుమార్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, భుజంగరావు, విటల్, బద్రీనాథ్, రాము నిర్భయ్, వెన్నం సుజాత తదితరులు

# బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



**వరంగల్, అక్టోబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని అందుకే ప్రజలు కేసీఆర్ ను కోరుకుంటున్నారని బిఆర్ఎస్ పార్టీ కి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.హనుమకొండ రాంనగర్ లోని ఆయన స్వగృహంలో బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ పార్టీనేత టిపిసిసి గీత సెల్ సెక్రటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ తో పాటు పలువురు బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారికి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ ప్రెసిడెంట్ భూక్య సాంబయ్య నాయక్, 55వ డివిజన్ ప్రెసిడెంట్ అటికం రవీందర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి, మాజీ ఎంపీపీ అప్పారావు, వర్ధన్నపేట మండల అధ్యక్షులు తూళ్ళ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఫ్రీ హెల్త్ క్యాంప్

వికాస్ గ్రామర్ హై స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహణ
ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గాజులరామారం డివిజన్ భవాని నగర్ పరిధిలోని వికాస్ గ్రామర్ హై స్కూల్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి నాయకులు, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకటేష్, పాండు, నరసింహ రావు, వికాస్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఈ శిబిరం ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.

# డీజీపీ శివధర్ రెడ్డిని కలిసిన రైతు కమిషన్ బృందం

-అసభ్యకరమైన సోషల్ మీడియా పోస్ట్‌లపై చర్చ



**హైదరాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొత్తగా డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్ రెడ్డిని రైతు కమిషన్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. డీజీపీ కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి, పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, భవానీ రెడ్డి పాల్గొన్నారు. డీజీపీతో జరిగిన సమావేశంలో సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌లో వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన పోస్ట్‌లు, టైటిల్స్, థంబ్‌నెయిల్స్ పెడుతున్న పరిస్థితిపై చర్చించారు. ఈ విధమైన పోస్ట్‌ల వల్ల బాధితుల కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని గుర్తుచేశారు. అత్యున్నత హోదాలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసి వీడియోలు యూట్యూబ్‌లో అప్లోడ్ చేయడం అనుచితమని పేర్కొన్నారు. ఏ వ్యక్తిపై అయినా ఈ తరహా పోస్ట్‌లను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని రైతు కమిషన్ బృందం డీజీపీకి విజ్ఞప్తి చేసింది.

# కల్తీ ఆహారాన్ని అరికట్టండి

❖ కిడ్నీలను కాపాడండి
❖ కొత్తపల్లి సత్యనారాయణ



**హుస్నాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో గత 5 -6 సంవత్సరాలుగా పేద, మధ్యతరగతి ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ, వయోపరిమితులు లేకుండా మరణాలు ఎదుర్కొంటున్నారని అఖిలభారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. విషపూరిత కల్తీ ఆహార పదార్థాలు, నీరు, మద్యం, నూనె, పాలు, పండ్లు, టిఫిన్ అన్నీ కల్తీగా మారిన ఈ పరిస్థితిలో ప్రజలు ఆరోగ్యంగా ఎలా ఉంటారని ప్రశ్నించారు. మార్కెట్లో నాణ్యతలేని వస్తువులు విచ్చలవిడిగా విక్రయించబడుతున్నాయని, వాటిపై నియంత్రణ లేకపోవడం వల్ల ప్రజల జీవితం ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నారు. ఆహార భద్రత చట్టాలు, ఆరోగ్య నియంత్రణ సంస్థలు ఉన్నా, వాటి అమలు లేకపోవడం వల్ల సమాజం కల్తీకి బలైపోతుందని, అధిక లాభాల కోసం సగటు మనిషి ప్రాణాలు బలికెత్తబడుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఓటు చోరీపై సంతకాల సేకరణలో పాల్గొన్న మంత్రి పొన్నం, జ్యోతి రాథోలే



**హుస్నాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రాథోలే, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం అనభేరి చౌరస్తా నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఓటు చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. ఐపీఎస్ అధికారి పురన్ ఆత్మహత్య, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ -బీజేపీ కుట్రలు, దేశవ్యాప్తంగా ఓటు తొలగింపులపై మంత్రి తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో "జై బాపు -జై భీమ్ - జై సంవిధాన్" ఉద్యమం కొనసాగుతోందని, ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం అవసరం

❖ 18న బంద్‌ను జయప్రదం చేయండి
❖ బుచ్చన్న యాదవ్ పిలుపు




**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్ల చట్టాన్ని కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బుధవారం కమాన్ సెంటర్లో ప్లకార్డులతో నిరసన ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన చట్టాన్ని కేంద్రానికి పంపినా, మోడీ ప్రభుత్వం బీసీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రిజర్వేషన్ల అమలుకు బలమైన ఐక్య ఉద్యమం అవసరమని, అన్ని రాజకీయ పార్టీలను, బీసీ సంఘాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. హైకోర్టులో బుట్టెంగారి మాధవరెడ్డి వేసిన కేసు ప్రతులను దగ్ధం చేస్తూ నిరసన తెలిపారు. బీసీలను రోడ్లపైకి తీసుకొస్తున్న అగ్రకులాలు జరగబోయే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈనెల 18న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాలో ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజుగౌడ్, బాకం ఆంజనేయులు, జంగం కొమురయ్య యాదవ్, దానవీని రమేష్, మల్లేశం, ఓరుసుబన్నీ, మేకల కుమార్, ఎన్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యుఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల బ్రోచర్ ఆవిష్కరణ



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్రథమ మహాసభల బ్రోచర్‌ను కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి అల్లెపు అభిలాష్ మాట్లాడుతూ అక్టోబర్ 25 – 27 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని, విద్యను ప్రైవేటీకరణ వైపు నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. విద్యా హక్కు చట్టం అమలు, స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ జాప్యం, బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు వంటి అంశాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో మణి, తేజ, ఉమామహేశ్వర్, రాకేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా కలాం జయంతి ఉత్సవాలు




**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో "భారతరత్న" డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలు మరియు ప్రపంచ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి కలాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ కలాం సేవలు చారిత్రాత్మకమని, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇస్రో శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా, డిఆర్డిఓ కార్యదర్శిగా, శాస్త్రీయ సలహాదారుగా కలాం దేశానికి విశేష సేవలు అందించారని, ప్రోఖ్రాన్ అణు పరీక్షల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆరోగ్య రంగానికి కూడా సేవలందించిన కలాం స్మృతిలో 2015లో పోస్టల్ స్టాంపు విడుదల చేయబడిందని తెలిపారు. 'కలాం నీ జీవితానికి సలాం", "కలాం భావి భారతానికి ప్రతీక" అనే నాటికలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి పొన్నం

❖ విద్యార్థి వివేక్ మృతి ఘటనపై ఉపాధ్యాయులను అడిగి ఆరా



**హుస్నాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. ఈ నెల 7న అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి వివేక్ ఘటనపై ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వివేక్ తోటి విద్యార్థులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ప్రాథమికంగా తేలిందని, అయితే మరేదైనా కోణం ఉందా అనే దానిపై విచారణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందిస్తామని, ఈ ఘటనను రాజకీయం చేయొద్దని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గురుకులాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులపై పర్యవేక్షణ పెంచాలని సూచించారు.

# వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

❖ గుడిపేటలో పనుల పరిశీలన చేసిన కలెక్టర్ కుమార్ దీపక్



**హాజీపూర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నిర్మాణ స్థలాన్ని సందర్శించి సమీక్షించారు. 216 కోట్ల రూపాయల నిధులతో కళాశాల నిర్మాణం జరుగుతోందని, జిల్లాలో వైద్య సేవల విస్తరణకు ఇది కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి, గుత్తేదారులతో సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సిపిఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

❖ గుండెపోటు సమయంలో గోల్డెన్ సెకండ్లు వృథా చేయొద్దు
❖ కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గుండెపోటు సమయంలో ప్రాణాలను రక్షించేందుకు సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసిసిటేషన్) పద్ధతిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఈనెల 13 నుండి 17 వరకు సిపిఆర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి శిక్షణ నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గుండెపోటు సంభవించిన వెంటనే సిపిఆర్ చేయడం వల్ల ప్రాణాలు నిలిపే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు సంభవిస్తున్న నేపథ్యంలో ప్రతి ఇంట్లోనూ కుటుంబ సభ్యులకు సిపిఆర్ పద్ధతిపై అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డెమో ద్వారా సిపిఆర్ సమయంలో చేయవలసిన, చేయకూడని అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ తక్యుద్దీన్ ఖాన్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, ప్రోగ్రామ్ ఆఫీసర్ సనా, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

## ట్రస్మా రాష్ట్ర కన్వీనర్ కొమురయ్యకు ఘన సన్మానం



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర కన్వీనర్గా ఎన్నికైన సొగాని కొమురయ్య యాదవ్‌ను కరీంనగర్ జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సన్మానించారు. ప్రైవేటు విద్యా రంగంలో నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తూ, అనేకమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చిన ఘనత కొమురయ్యకు దక్కుతుందని సభ ప్రతినిధులు ప్రశంసించారు. విద్యా రంగంలో ఆయన సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

# సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణంపై సమావేశం

**నూతన జిల్లా అధ్యక్ష నియామకంపై నేతల చర్చ**



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఏఐసీసీ పిలుపు మేరకు “సంఘటన్ సృజన్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ మన్నె శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ పాల్గొన్నారు.కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంటుందని, జిల్లా అధ్యక్ష ఎన్నిక పారదర్శకంగా జరుగుతుందని నేతలు తెలిపారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ పర్యవేక్షణలో కార్యకర్తల అభిప్రాయాల మేరకు అధ్యక్షుడిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమన్యాయం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని, విభేదాలకు తావు లేకుండా బ్లాక్ లెవెల్ సమావేశాల ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. భారత్ జోడో యాత్ర విజయవంతం కావడంలో కార్యకర్తల సహకారం కీలకమని, పార్టీ బలపర్చేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయండి

**బీసీ ఐక్య వేదిక పిలుపు**



**హుస్నాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు స్థానిక సంస్థలలో విద్యా, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్ సాధించేందుకు చేపట్టిన ఉద్యమాలపై బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సమావేశం జరిగింది. ఈ నెల 18న బీసీ జేఏసీ పిలుపు మేరకు తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కాంగ్రెస్, సిపిఐ, బీజేపీ, బీఎస్పీ, బీసీ కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు పాల్గొన్న ఈ సమావేశంలో మేకల వీరన్న యాదవ్‌ను బీసీ ఐక్య వేదిక కోఆర్డినేటర్‌గా ఎన్నుకున్నారు.మహాత్మా జ్యోతిబా ఫులే, సావిత్రిబాయి ఫులే, అంబేద్కర్, బీపీ మండల్ తదితర సామాజిక విప్లవకారుల త్యాగాలను గుర్తుచేస్తూ, వారి ఆలోచనల దిశగా బీసీ కులాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, వ్యాపారులు, హొటల్స్, షాపులు, సినిమా టాకీస్ సహకరించాలని మేకల వీరన్న యాదవ్ కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ, సామాజిక, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలి

**ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**మానకొండూర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వంగా ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు.బుధవారం దేవంపల్లి, కెల్లేడు, రంగపేట, పచ్చునూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండించిన వరిని నాణ్యత ప్రమాణాలతో కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, పలువురు డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ఉచిత గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం రైతులకు మేలు చేసే కార్యక్రమం

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**హనుమకొండ, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం కింద హనుమకొండ జిల్లా పశు వైద్య సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు (బ్రూసెల్లా) వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య పాల్గొన్నారు. పశుసంపద గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని, ప్రతి రైతు తన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గాలికుంటు వ్యాధి పశువులతో పాటు మనిషికి కూడా సోకే ప్రమాదం ఉన్నందున, ఈ టీకాలు కుటుంబ ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయని తెలిపారు. పశువైద్య శాఖ చురుకుగా పనిచేస్తోందని, రైతుల్లో అవగాహన పెంచడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు, డివిజన్ అధ్యక్షులు పున్నం, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పోయిన ఫోన్‌ను రికవరీ చేసి యజమానికి అప్పగించిన పోలీసులు



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2023 నవంబర్ 22న బొమ్మకల్ ప్రాంతంలో తన రెడ్‌మీ ఫోన్ పోగొట్టుకున్న పురుమల్ల రాజేష్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ కర్నూల్‌లో ఉన్నట్లు గుర్తించి, పోలీసులు రికవరీ చేశారు. బుధవారం రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి ఫోన్‌ను యజమాని రాజేష్‌కు అప్పగించారు. ఈ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ నిరంజన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# వివేక్ మృతిపై విచారణ వేగవంతం చేయాలి

**- బీజేపీ నేతల డిమాండ్**

**కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి**



**హుస్నాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లెల్‌గడ్డ గ్రామంలో ఈ నెల 7న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సానాదుల వివేక్ ఘటనపై బీజేపీ మండల నాయకులు హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ మాట్లాడుతూ వివేక్ మృతిపై విచారణ కమిటీ వేగంగా చర్యలు తీసుకోవాలని, దోషులను నిర్ధారించి న్యాయం చేయాలని కోరారు. మృతుడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలను తమ పిల్లలవలే చూసుకోవాలని, వారి ప్రవర్తనపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ, గిరిజన మోర్చా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# డైలీవెజ్ వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను

**ఎమ్మెల్యే వంశీకృష్ణ**

**అమ్రాబాద్, సెప్టెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, మన్ననూర్ గ్రామంలోని తెలంగాణ ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో పనిచేస్తున్న డైలీవెజ్ వర్కర్ల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి అసెంబ్లీలో ప్రస్తావించి వేతనాలు పెంచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ



సందర్భంగా డైలీవెజ్ వర్కర్లు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యురేనియం వ్యతిరేక పోరాట నాయకులు నాసరయ్య, శంకర్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, డైలీవెజ్ వర్కర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బుగులోని జాతరకు ముందస్తు అభివృద్ధి పనుల పరిశీలన

**రెండు కోట్లతో మెట్లు, బావులు -5.5 కోట్లతో రోడ్లు**



**భూపాలపల్లి, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రేగొండ మండలం తిరుమలగిరి పరిధిలో జరిగే బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరను పురస్కరించుకుని అభివృద్ధి పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు కోట్ల రూపాయలతో మెట్ల వెడల్పు, కోనేరు, మంచినీటి బావి పనులకు మంజూరు ఇచ్చామని, కొత్తపల్లి, తిరుమలగిరి, జగ్గయ్యపేట నుండి బుగులోని జాతరకు రోడ్ల నిర్మాణానికి 5.5 కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో జాతర చైర్మన్ గంగుల రమణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుతోజ్ కిష్టయ్య, నాయినేని సంపత్ రావు, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఫారెస్ట్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణ పనులను కూడా పరిశీలించారు.

# బస్సు సౌకర్యం కోసం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం - బీజేపీ నేతలు



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామడుగు మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెగడపెల్లి, గోపాలరావుపేట, మోతె, గోలిరామయ్యపల్లి, కొక్కెరకుంట గ్రామాల నుండి కరీంనగర్‌కు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు నిత్య ప్రయాణాల్లో ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ఆర్టీసీ యంత్రాంగానికి అనేకసార్లు వినతులు చేసినా ఫలితం లేకపోవడంతో, వెంటనే బస్సు సౌకర్యం కల్పించకపోతే ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండ తిరుపతి రెడ్డి, ఉప్పు శ్రీనివాస్ పటేల్, పోచంపెల్లి నరేష్, పురేళ్ల శ్రీకాంత్ గౌడ్, సంటి జితేందర్, దూరుశెట్టి రమేష్, ఎడవెల్లి రాం, ఎడవెల్లి లక్ష్మణ్, దయ్యాల రాజు, రమేష్, కలిగేటి ఎల్లయ్య, షేవెళ్ళ అక్షయ్, ఉత్తేమ్ కనుకరాజు, రాగం కునుకయ్య, అంబటి శ్రీనివాస్, ఉప్పు తిరుపతి, నాగి లచ్చయ, ఆకరపు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాడిపరిశ్రమపై ప్రత్యేక దృష్టి

**-ఎమ్మెల్యే కవ్వంపల్లి**




**మానకొండూర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపరిశ్రమ రైతులకు అదనపు ఆదాయ మార్గమని, పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే మేత, దాణా, టీకాలు తప్పనిసరిగా అవసరమన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు తక్కువ మోదులో పాలిస్తాయని, టీకాలు వేయించడంపై రైతుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం విడతల వారీగా టీకాల వారోత్సవాలు నిర్వహిస్తున్నదని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు బండారి రమేశ్, కొత్త తిరుపతిరెడ్డి, గోగూరి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్ అమలుకు రాష్ట్ర బంద్ పిలుపు



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42% రిజర్వేషన్ అమలుకు ఈ నెల 18న రాష్ట్ర బంద్ నిర్వహించాలని బీసీ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ సంఘాలు, కుల సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకారం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటికి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అమలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బంద్‌కు అన్ని పార్టీల నాయకులు మద్దతు ఇవ్వాలని, రిజర్వేషన్ అమలయ్యేంత వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో ఎన్నం ప్రకాష్, ఆది మల్లేశం, నాగుల కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు, నారోజు రాకేష్ చారి, కోడూరి పరశురామ్ గౌడ్, నర్సింగోజు శ్రీనివాస్, రంగు సంపత్ గౌడ్, మాచర్ల అంజయ్య, గంగిపెల్లి అరుణ, ఎడ్ల సురేందర్, ఆకుల సురేష్, చిగుర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సి.పి.ఆర్. పై అవగాహన కల్పించిన మహిళా డిగ్రీ కళాశాల

ప్రాణాపాయ సమయంలో ప్రాథమిక చికిత్స కీలకం - డా. ప్రణవ్



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో బుధవారం సి.పి.ఆర్. (కార్డియోపల్మనరీ రిసస్సిటేషన్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్డియాక్ అరెస్టు సమయంలో సకాలంలో సి.పి.ఆర్. చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని డా. ప్రణవ్ తెలిపారు. విద్యార్థినులకు సి.పి.ఆర్. విధానాన్ని వివరించి, ప్రత్యక్షంగా చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్లు స్వరూప, డా. ఆర్. మొగిలి, డా. యం.వి. లక్ష్మణ్ రావు, డా. ఈ. స్రవంతి, కోఆర్డినేటర్ పోచయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవలేబుల్ స్కీం బకాయిలు విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ డిమాండ్




**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 180 కోట్ల బెస్ట్ అవలేబుల్ స్కీం బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తక్షణమే స్పందించకపోతే తల్లిదండ్రులతో కలిసి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్కీం బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల పాఠశాలల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందించకపోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే స్కీం అమలులో నిర్లక్ష్యం వహించరాదని డిమాండ్ చేశారు. ధర్నాలో గజ్జల శ్రీకాంత్, కాంపెల్లి అరవింద్, మోహన్, కొంపెల్లి సాగర్, పులిపాక సాయికుమార్, కండె రాజు, అసంపల్లి వినయ్, బొగేశ్, రోహిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### బాలికలు పట్టుదలతో విజయం సాధించాలి - కలెక్టర్ పమేలా




**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బాలికలు సానుభూతితో కాకుండా కష్టపడి చదివి, నైపుణ్యంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా "మిస్ కరీంనగర్" పోటీలు నిర్వహించారు. విజేతలకు అవార్డులు, ఇతరులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు పంపిణీ చేశారు. కలెక్టర్ స్వయంగా ఆలపించిన "ఓ చిన్ని పిచ్చుక" పాటను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అశ్విని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అకడమిక్ ఒత్తిడి తస్మాత్ జాగ్రత్త!

యవ్వనంలో విద్యార్థులను మానసిక తుఫానులు తాకుతున్నాయి

## యవ్వనం అంటే ఉత్సాహం, కలలు, ఆశయాల తుఫాన్!





ఈ దశలోనే శారీరక, మానసిక, భావోద్వేగ మార్పులు ఒక్కసారిగా సంభవిస్తాయి. ఆ మార్పుల జ్వాలల్లో ఇపుడు విద్యా ఒత్తిడి అనే మరొక అగ్ని దహిస్తోంది. ఇదొక మౌన మానసిక మాంద్యం ఇది కనబడదు కానీ చంపేస్తుంది.

**ప్రతి 42 నిమిషాలకు ఓ విద్యార్థి ఆత్మహత్య!**

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) చెబుతున్న గణాంకాలు కలచివేస్తున్నాయి.
2020లోనే దేశవ్యాప్తంగా 10,500 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.
వీరిలో దాదాపు 40 శాతం కేసుల్లో చదువు ఒత్తిడి ప్రధాన కారణం!
ఇంకా ఎన్నో వేల మంది డిప్రెషన్, ఆందోళనలతో మానసికంగా తల్లడిల్లుతున్నారు.

**తల్లిదండ్రుల ఆశలు - ఒత్తిడిగా మారినప్పుడు**

'నా బిడ్డ పెద్దవాడై మంచి స్థాయికి చేరుకోవాలి" ప్రతి తల్లిదండ్రి కల. కానీ అదే కల అధిక అంచనాల రూపంలో మారితే పిల్లలకు భారం అవుతుంది.
చదువులో కొంచెం వెనుకబడ్డా, "నీ స్నేహితుడు ఫస్ట్ అవుతున్నాడు చూడు!" అన్న మాట పిల్లల మనసులో గాయమై మిగిలిపోతుంది. ఇక కార్పొరేట్ కాలేజీలలో వారం వారం పరీక్షలు, ర్యాంకుల ఆధారంగా క్లాసు మార్పులు, టార్గెట్ ప్రెషర్లు... ఇవన్నీ పిల్లలను రాత్రింబవళ్ళు మానసిక యుద్ధం చేయిస్తున్నాయి. చివరికి 'స్ట్రెస్ మేనేజ్మెంట్ సెషన్' పేరిట చిన్న ఉపన్యాసం పెట్టి చేతులు దులుపుతారు. కానీ విద్యార్థుల మనసుల్లో ఒత్తిడి మాత్రం తగ్గదు.

**హాస్టల్ జీవితం - ప్రేమ లేని పాఠశాల**

ఇంటిని విడిచి హాస్టల్‌లో ఉండటం, ఆటపాటలు లేకపోవడం, ఫ్రెండ్స్‌తో బంధం తగ్గిపోవడం ఇవన్నీ కలిసి విద్యార్థుల మనసులను గట్టిగా కదిలిస్తున్నాయి.
"తల్లిదండ్రుల ప్రేమ" లేకుండా, "పోటీ మార్కులు"తో నిండిన వాతావరణం చిన్న వయసులోనే పెద్ద ఒత్తిడిగా మారుతోంది.
పర్ఫెక్షనిజం- సక్సెస్ కాదు, స్ట్రెస్!
'టాప్ ర్యాంక్ రావాలి!" అనే లక్ష్యం మంచిదే. కానీ ఆ లక్ష్యం పర్ఫెక్షన్ పేరుతో అతి ఆందోళనగా మారితే, అది ప్రమాదం.
పర్ఫెక్షనిజం అనేది ఒక మానసిక బంధనం.
చిన్న తప్పిదానికే "నేను ఫెయిల్ అయ్యాను" అనిపిస్తుంది.
ఇలా తమను తాము శిక్షించుకుంటూ ఆత్మవిశ్వాసం కోల్పోతున్నారు టీనేజర్లు.

**ఇష్టంలేని చదువులు -ఆత్మవిశ్వాసానికి శత్రువు**

ప్రతి విద్యార్థికీ ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుంది. ఎవరికైనా క్రీడలు, సంగీతం, కళలు అంటే ఇష్టంబీ మరికొందరికి సైన్స్, మ్యాథ్స్.
కానీ చాలాసార్లు తల్లిదండ్రుల అభిప్రాయం ఒక్కటే మార్గం అవుతుంది.
దాంతో ఇష్టంలేని సబ్జెక్టులు, నిరంతర పరీక్షలు, గ్రేడ్లు- ఇవన్నీ కలసి ఒక నిరుత్సాహ వలయాన్ని ఏర్పరుస్తాయి.

**చదువుకు పక్కన జీవితం కూడా ఉంది**

చదువులో బ్యాలెన్స్ చాలా ముఖ్యం.
"ఏం చదివాం?" కంటే "ఎలా చదివాం?" అనేదే అసలైన ప్రశ్న.
పిల్లల్ని వారికి నచ్చిన దిశలో నడిపించాలి.
మార్కులు, ర్యాంకులు మాత్రమే విజయమని కాదు - మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఆనందం కూడా సక్సెస్‌లో భాగమని గుర్తుంచుకోవాలి.

**చదువుల ఒత్తిడికి ప్రధాన కారణాలు**

-తల్లిదండ్రుల అధిక అంచనాలు
- ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల హడావిడి
- మార్కులకే ప్రాధాన్యం - ఆలోచనా శక్తికి తక్కువ ప్రాధాన్యం
- కౌన్సెలింగ్ సదుపాయాల కొరత
- ఆటపాటలు, విశ్రాంతికి సమయం లేకపోవడం
- గ్రామీణ విద్యార్థులకు పట్టణ విద్యా సదుపాయాలతో పోటీ
-అమ్మాయిలపై అదనపు సామాజిక ఒత్తిడి

**ఒత్తిడిని తగ్గించే మార్గాలు**

- మీ బలాలు, పరిమితులను తెలుసుకుని వాస్తవిక లక్ష్యాలు పెట్టుకోండి
-తప్పులు అంటే భయం కాకుండా నేర్చుకునే అవకాశం అని భావించండి
-చదువు, నిద్ర, వ్యాయామం ం మూడింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వండి
- సమయాన్ని సద్వినియోగం చేసుకునే అలవాటు చేసుకోండి
-ఒత్తిడిని తట్టుకోలేకపోతే, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సైకాలజిస్టులను సంప్రదించండి

జీవితం ఒక్క పరీక్ష కాదు, అనుభవాల పాఠశాల.
ప్రతి ఫలితం చివరి కాదు. ప్రతి వైఫల్యం ఓ పాఠం.
చదువులు మనల్ని జీవితానికి సిద్ధం చేయాలి - జీవితాన్ని కోల్పోయేలా కాకుండా.

**కాబట్టి అకడమిక్ ప్రెజర్‌తో తస్మాత్ జాగ్రత్త!**
**చదువు సంతోషంగా సాగాలి, ఒత్తిడిగా కాదు!**

వ్యాసకర్త
చెరుకు జంగయ్య గౌడ్
సామాజిక కార్యకర్త



## పోషణ మాసంలో ఉత్తమ సేవలకుగాను అవార్డులు

-అంగన్వాడి కార్యకర్తలకు ప్రశంస పత్రాలు
- దేవరకొండ ఐసిడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం



**దేవరకొండ, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 18 వరకు నిర్వహిస్తున్న పోషణ పక్షం మాసాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన అంగన్వాడి సిబ్బందిని దేవరకొండ ఐసిడీఎస్ ప్రాజెక్టు ప్రశంసించింది. గుండ్లపల్లి మండలంలోని కందుకూరు సెక్టార్ పరిధిలో సేవలందిస్తున్న సూపర్వైజర్ రమణ, తవకలాపూర్ అంగన్వాడి కేంద్రం-2 టీచర్ భయ్యా రామ వెంకట్, అంగన్వాడి కేంద్రం -1 ఆయా గుడిసెర్ల సైదమ్మలకు ఉత్తమ సేవలకుగాను ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఐసిడీఎస్ సిడిపిఓ చంద్రకళ, మండల తహసీల్దార్, ఎంపీడీవో డానియెల్, ఐసిడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై పెయింటింగ్ ద్వారా అవగాహన

నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా విద్యార్థుల సృజనాత్మకత





**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నషా ముక్త్ భారత్ అభియాన్‌కు ఐదేళ్లు పూర్తైన సందర్భంగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జూనియర్ కళాశాలల విద్యార్థులు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వాల్ పెయింటింగ్ ద్వారా వివరించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయ గోడపై 17 మంది విద్యార్థులు తమ చిత్రలేఖన ప్రతిభను ప్రదర్శించారు. పోటీలను జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి సరస్వతి, ఎన్ఎంబిఏ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి, మర్రి రాజేందర్, కళాశాల సిబ్బంది పర్యవేక్షించారు.

# రైతులు ఈ సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

**-రైతులకు భరోసానిస్తూ, రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య లక్ష్యం.**

**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**



**దేవరకొండ,అక్టోబర్ 15.(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ మండలంలోని మర్రిచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు ఇఉత్పత్తిదారుల సంస్థ కేంద్రం వద్ద ఎమ్మెల్యే బాలు నాయక్ సబ్సిడీ చిరు వేరు శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, స్వయంగా రైతులకు వేరు శనగ విత్తనాలను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూరైతులు ఈ సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందేలా ఈ విత్తనాలను సబ్సిడీతో అందిస్తున్నామన్నారు.ఒక్కొక్కరికి 100kg ల చొప్పున వేరుశెనగ విత్తనాలను ఉచితంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం.

ఈ పథకం కింద 100 శాతం సబ్సిడీతో, నేషనల్ ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద విత్తనాలు పంపిణీ చేయబడతాయి అని తెలిపారు.రైతులకు పంటల తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువస్తోందని, వాటిని గ్రామస్థాయిలో ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. పంటల విస్తరణ, సమర్థవంతమైన సాగు పద్ధతులు, నీటి వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు తోడుగా ఉంటుందని అన్నారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేయబడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్ నాయక్,మాజీ జడ్పీటీసీ మారుపాకల అరుణ సురేష్ గౌడ్, మాజీ ఎంపీపీ జానీ యాదవ్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శిరందాస్ కృష్ణయ్య,సీనియర్ నాయకులు రుక్మా రెడ్డి, హన్మంతు వెంకటేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ సీత్యా నాయక్, మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, వ్యవసాయ అధికారి శ్రీలక్ష్మి, ఎంపిడిఓ డానియల్, తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటయ్య , మైత్రి ఎఫ్ పిపివో డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**ఒక్కొక్క కుటుంబానికి 5వేలచొప్పున ఆర్థిక సాయం అందించిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జెనిగల మహేష్ యాదవ్**



**కడ్తాల్, అక్టోబర్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో కొన్ని రోజుల క్రితం 5 మంది అనారోగ్యంతో మృతి చెందారు. అదేవిధంగా బైకు ప్రమాదంలో కింద పడ్డ వ్యక్తి ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మహేష్ యాదవ్ బాదిత కుటుంబాలకు బుధవారం సాయం అందించారు. ఇటీవల వెంకటమ్మ భర్త రామచంద్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.అదేవిధంగా ఈర్ల పల్లి రాములమ్మ అత్తగారు బుడ్డమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈర్లపల్లి అనిత భర్త రాజు అనారోగ్యంతో మృతి చెందారు. 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. పెద్ద రాములయ్య భార్య పున్నమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. దేరంగుల అమృత భర్త నరసింహ అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా యాదయ్య బైకు యాక్సిడెంట్లో ప్రమాద శాతం కిందపడ్డాడు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు ఆ వ్యక్తిని పరామర్శించి 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలను పరామర్శించి మొత్తం 6 కుటుంబాలకు 30000 ఆర్థిక సాయం చేయడం జరిగిందని అని తెలిపారు. ఎవ్వరు అధైర్య పడొద్దు ధైర్యంగా ఉండాలని ఇలాంటి ఇబ్బంది వచ్చిన నాకు తెలియజేయాలని కుటుంబాలకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా ఊరి అభివృద్ధిలో ముందుంటా ఎవరికి ఏ సాయం కావాలన్నా నాకు తెలియజేయండి నా వంతు సహా సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, చంటి, బిక్షపతి, నవీన్, సాదిక్, రాజేష్, లక్ష్మణ్, మధు, మహేష్, రాకేష్, వినోద్, రమేష్ శ్రీకాంతు, శ్రీధర్, వంశీ, శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో వంట పనులు చేయించడం దారుణం

**బిఆర్ఎస్వి గణేష్ వర్కర్ల**



**కల్వకుర్తి, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి ఆశ్రమ గురుకుల పాఠశాలలో వంట వర్కర్ల సమ్మె నేపథ్యంలో విద్యార్థులే వంట పనులు, తరగతి గదుల శుభ్రత పనులు చేయడం దారుణమని బిఆర్ఎస్వి అధ్యక్షుడు దారమోని గణేష్ తీవ్రంగా ఖండించారు. వర్కర్ల పెండింగ్ జీతాలు, న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, విద్యార్థులకు రెండు రోజులుగా భోజనం లేక ఇంటికి తిరుగు ప్రయాణం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సీనియార్టీ ప్రకారం జీతాలు పెంచాల్సిన చోట సగం జీతాలు ఇవ్వడం వల్లే సమ్మె ప్రారంభమైందని పేర్కొన్నారు.రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి, వర్కర్ల సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి భోజనం, పరిశుభ్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కల్తీ భోజనం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని, గురుకులాల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పెండింగ్ స్కాలర్షిప్‌లు విడుదల చేయాలని, అధ్యాపకులకు జీతాలు ఇవ్వాలని, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కేసీఆర్ హయాంలో 1000కి పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం ఘనతగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, యువత, నిరుద్యోగులు నిరుత్సాహంగా ఉన్నారని, సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకురాలు సుశీల, ఈశ్వరయ్య, శేఖర్ గౌడ్, రవి, కేశవులు, శ్రీరాములు, శరత్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మారెడ్డిపల్లిలో రోడ్డు ప్రమాదం

**గర్భిణి యువతి మృతి**

**తిమ్మారెడ్డిపల్లి, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బుధవారం ఉదయం కొమురవెల్లి కామన్ నుండి తిమ్మారెడ్డిపల్లి రేషన్ షాప్‌కు బియ్యం తీసుకునేందుకు వచ్చిన ఇద్దరికి రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుండి సిద్దిపేటకు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహమ్మద్ అసిఫా (26) తీవ్రంగా గాయపడి, ఆసుపత్రికి తరలించిన తర్వాత మృతి చెందింది. ఆమె మామగారు మహమ్మద్ ఘోరమీయకు కూడా గాయాలయ్యాయి. పెళ్లయిన ఐదు సంవత్సరాల తర్వాత తల్లి కాబోతున్న ఆనందంలో ఉన్న అసిఫా, ఈ ప్రమాదంతో అకాల మరణం చెందడం గ్రామాన్ని విషాదంలో ముంచెత్తింది. తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# అక్రమ ఇసుక రవాణా

**వల్లంపహాడ్ వద్ద వ్యక్తి అరెస్ట్**




**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వల్లంపహాడ్ గ్రామానికి చెందిన సంకూరి శ్రవణ్ (తండ్రి రాజయ్య) తన ట్రాక్టర్ మరియు ట్రైలర్ ద్వారా మానేరు వరివాహక ప్రాంతమైన వల్లంపహాడ్ వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా, హరి హర ఫంక్షన్ హాల్ వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కోసం కోర్టుకు తరలించినట్లు సమాచారం. గతంలో అక్రమ ఇసుక రవాణా చేసిన వారు మళ్లీ అదే చర్యకు పాల్పడితే వారి ట్రాక్టర్లు సీజ్ చేసి కోర్టులో డిపాజిట్ చేస్తామని, అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# సిటిజన్ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

**కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న "తెలంగాణ రైజింగ్ విజన్ -2047" డాక్యుమెంట్‌లో ఉద్యోగులందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందుతున్న ఈ డాక్యుమెంట్‌లో ప్రజల ఆలోచనలు, సూచనలు ప్రతిబింబించేందుకు అక్టోబర్ 10న సిటిజన్ సర్వే ప్రారంభమైంది. రాష్ట్ర ప్రజలతో పాటు ఎన్.ఆర్.ఐలు కూడా పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 14న సర్క్యులర్ జారీ చేసి, ప్రతి ఉద్యోగి ఈ సర్వేలో పాల్గొని తమ విలువైన సూచనలు అందించాలని ఆదేశించింది. ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనున్న ఈ సర్వేకు సంబంధించి లింక్, క్యూఆర్ కోడ్‌లను కార్యాలయాల్లో ప్రదర్శించి విస్తృత ప్రచారం నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రతి పౌరుడు ఈ డాక్యుమెంటరీ రూపకల్పనలో భాగస్వామ్యమై, తెలంగాణ భవిష్యత్ దిశగా తమ ఆలోచనలు పంచుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్ డ్రైవర్ల సమ్మె ప్రారంభం



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జెబీఎం ఎలక్ట్రిక్ బస్ డ్రైవర్లు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహన సవరణ చట్టం ద్వారా ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయడంపై సీఐటీయూ నేతలు గిట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్ తీవ్రంగా విమర్శించారు.వేతనాలు ఆలస్యం, పీఎఫ్ -ఈఎస్ఐ సౌకర్యాల లేకపోవడం, 15 -17 గంటల డ్యూటీలు, ప్రమాదాల సమయంలో కేసులు నమోదు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. నిరసనలకు ఆంక్షలు విధించడం సరికాదని, ఉద్యమాలను అడ్డుకుంటే తీవ్ర ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పుల్లెల మల్లయ్య, సత్యపాల్, రాజు, అమిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల సంక్షేమమే లక్ష్యం



**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాజీ డిప్యూటీ మేయర్ చల్లా హరిశంకర్ కార్యాలయంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా కరాటే సీనియర్, జూనియర్ మాస్టర్ల అత్యవసర సమావేశం జరిగింది. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల మాస్టర్లు పాల్గొన్నారు. కరాటేను ప్రభుత్వ క్రీడగా గుర్తించేందుకు, క్రీడాకారులకు ఇండ్ల స్థలాలు, భవనాలు, ఉచిత వైద్యం, ఇన్సూరెన్స్ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కరాటే బాడీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా కె. వసంత్ కుమార్, చీఫ్ పాట్రన్‌గా సంపత్ కుమార్, చీఫ్ అడ్వైజర్‌గా మొండయ్య, అధ్యక్షుడిగా సురభి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా గౌరు రాజిరెడ్డి, కోశాధికారిగా డా. బొల్లి ఐలయ్య, ఉపాధ్యక్షులుగా అక్బర్ ఖాన్, రెఫరీ కమిషన్ చైర్మన్‌గా ఈ. శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్తి కమిటీని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

# తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డా. నరేందర్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించారు.1991 నుంచి విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తూ, నాణ్యమైన విద్యతో విద్యార్థులను ఉత్తమ స్థానాల్లో స్థిరపరచడంలో కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ అవార్డును డా. అబ్దుల్ కలాం గారికి అంకితమిస్తున్నానని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. వారంలో రెండో ప్రతిష్టాత్మక అవార్డు రావడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయని, ఇది తనపై మరింత బాధ్యతను మోపిందని పేర్కొన్నారు.

# సంతాపూర్ గ్రామ శివారు లో రోడ్డు ప్రమాదం

**- డీసీఎం బోల్తా సహాయక చర్యలు చేపట్టిన స్థానిక మాజీ సర్పంచ్ బి అంజయ్య**



**కడ్తాల్, అక్టోబర్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండలంలోని మక్తమాధారం – షాద్ నగర్ ప్రధాన రహదారి సంతాపూర్ గ్రామ శివారు లో రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం చేగుంట నుండి సంతపూర్ గ్రామానికి వెళుతున్న కోడి దాన లోడు కలిగిన డీసీఎం వాహనం సంతాపూర్ గ్రామ శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. తృటిలో తప్పిన ప్రాణాపాయం డీసీఎం డ్రైవర్ క్లీనరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్ బి. అంజయ్య హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని తనవంతు సహాయంగా సహాయక చర్యలు చేపట్టారు. ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదు. సహాయక చర్యల్లో గ్రామస్థులు నర్సిరెడ్డి, కేశవులు దుర్గం నారాయణ, బాల్ రెడ్డి,యాలాల శేఖర్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, కోరెమోని యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

**-ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు**
**- జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్**



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. బస్టాండ్, నాగనూలు, శ్రీపురం చౌరస్తాల్లో సిగ్నల్స్ ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, ప్రజలకు సురక్షిత రవాణా కోసం వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్సై గోవర్ధన్, ట్రాఫిక్ ఎస్ఐ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మారెడ్డిపల్లిలో కోతుల బెడద







**కొండపాక, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా పెరిగిపోయింది. యువకులు, మహిళలపై దాడులు, వృద్ధులు బయట కూర్చోవడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. పంట పొలాలకు కూడా భారీ నష్టం జరుగుతోంది. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ప్రతి కుటుంబం 500 చొప్పున పెద్దమనుషుల సమక్షంలో జమ చేసి కోతులను పట్టించేందుకు నిర్ణయం తీసుకున్నారు. గతంలో కూరెళ్ళ గోవర్ధన్ రెడ్డి తన సొంత నిధులతో కోతులను పట్టించినా, సహకారం లేకపోవడంతో ఆ ప్రయత్నం మధ్యలో నిలిచిపోయింది.ఈసారి గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి, సమస్యను పరిష్కరించేందుకు సమిష్టిగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

**ఏఐసీసీ సెక్రటరీ బిశ్వాత్ రాజా మహతి**







**దేవరకొండ, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా దేవరకొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలు నాయక్, ఏఐసీసీ సెక్రటరీ బిశ్వాత్ రాజా మహతి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో పార్టీ బలోపేతంపై చర్చ జరిగింది. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. డీసీసీలకు టికెట్ సిఫారసు అధికారం ఉండబోతుందని, మండల -గ్రామ స్థాయి నాయకులకు కీలక బాధ్యతలు అప్పగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

**-పశు వైద్యాధికారిణి ఝాన్సీ**



**ఎలిగేడు, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించుకోవాలని పశు వైద్యాధికారిణి ఝాన్సీ సూచించారు. బుధవారం ముప్పిరితోట గ్రామంలో 122 పశువులకు టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. ఈ టీకా కార్యక్రమం నెల రోజులపాటు కొనసాగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పశువులను రక్షించుకోవాలని ఆమె కోరారు.

# ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సంతకాల సేకరణ

**వెల్దండలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మోతిలాల్ నాయక్**



**వెల్దండ, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, వెల్దండ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ ఓట్ల చోరీ ద్వారా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని మోతిలాల్ నాయక్ ఆరోపించారు.కార్యక్రమంలో భూపతిరెడ్డి, పర్వత్ రెడ్డి, సంజీవ్ కుమార్ యాదవ్, మట్ట వెంకటయ్య గౌడ్, కొయ్యల పుల్లయ్య, ముదిగొండ రమేష్, గుద్దేటి కిష్టాల్, బాణావత్ శంకర్ నాయక్, నారాయణ నాయక్, భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు చోరీపై కాంగ్రెస్ సంతకాల సేకరణ



**కడ్తాల్, అక్టోబర్ 15 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: ఏఐసీసీ అదేశాల మేరకు బీజేపీ పార్టీ ఓట్ చోర్ అవినీతిని బహిర్గతం చేయడం కోసం కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోసు రవి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఇమ్రాన్ బాబా, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అశోక్, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, సాయి గౌడ్, గౌడ్, టౌన్ యూత్ అధ్యక్షుడు భానుకిరణ్, ఎస్సీ సెల్ నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్, విజయ్ రాథోడ్,సోమరాజు సందీప్, ప్రవీణ్ గౌడ్, సల్మాన్, సాయిలు, శేఖర్, సత్యం శ్రీను రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు బిజెపి బి ఆర్ ఎస్ మోకాలడ్డు: సిపిఐ




**వనపర్తి, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మోకాలు అడ్డుపెడుతున్నాయని సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి పిలుపు మేరకు వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూబీసీలకు గతంలో 37 శాతం రిజర్వేషన్లు ఉండగా, టీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని 23 శాతానికి తగ్గించిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు కేవలం 23 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. బీసీ జనాభా లెక్కల ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, టీఆర్ఎస్ అనుచరులు కోర్టుల్లో కేసులు వేసి రిజర్వేషన్ల అమలును అడ్డుకున్నారని ఆరోపించారు. బిల్లును అసెంబ్లీ ఆమోదించినప్పటికీ, గవర్నర్ మరియు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయకుండా నిలిపివేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చితే రిజర్వేషన్లకు చట్టబద్ధత లభిస్తుందని, తమిళనాడులో ఇదే విధంగా అమలు చేశారని వివరించారు. 56 శాతం బీసీలను పక్కనపెట్టి, 10 శాతం కూడా లేని ఓసీలకు 50 శాతం సీట్లు కావాలని కొట్లాడటం అన్యాయమన్నారు. బీసీల నోటికాడి ముద్దను లాక్కున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బీసీలు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గులాబీ జెండా మోస్తున్న టీఆర్ఎస్, కాషాయ జెండా మోస్తున్న బీజేపీలో ఉన్న బీసీ నాయకులు ఆలోచించాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం పార్టీలకతీతంగా బీసీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు కళావతమ్మ, గోపాలకృష్ణ, చిన్న కుర్మయ్య, పృధ్వినాదం, ఎర్రకుర్మయ్య, జయమ్మ, శిరీష, జ్యోతి, శ్రీదేవి, వెంకటమ్మ, రూప, సుప్రియ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రాజ కొమురమ్మ భౌతిక దేహానికి నివాళులర్పించిన వన్నాల వెంకట రమణ



**వరంగల్,అక్టోబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
వరంగల్ – కోటి లింగాల గుడి రోడ్ – మణికంఠ కాలనీ కి చెందిన భారతీయ జన సంఘ్ నాయకులు కీర్తిశేషులు ఓరుగంటి చక్రపాణి సతీమణి ఓరుగంటి రాజ కొమురమ్మ బుధవారం స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ వారి స్వగృహానికి వెళ్లి రాజ కొమురమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.
వారి వెంట సీనియర్ బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్,గుర్రపు సత్యనారాయణ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెన్కేపల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు




**హుస్నాబాద్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సైదాపూర్ మండలం వెన్కేపల్లి గ్రామంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంత సుధాకర్ ప్రారంభించారు. పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయాలని ఆయన సూచించారు. వ్యాధి నివారణకు టీకాలు అత్యంత అవసరమని, పశువుల ఆరోగ్యం ద్వారా రైతుల ఆర్థిక స్థితి మెరుగవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ న్యాదండ్ల రాజ్ కుమార్, పశు వైద్యాధికారి డా. విజేందర్ రావు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ మహేష్ నాయక్, గోపాలమిత్ర లాలు, శ్రీనివాస్, శరత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమం పాడి రైతులలో చైతన్యం కలిగించింది.

# డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కరీంనగర్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం




**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతరత్న, జాతి గర్వంగా భావించే మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కరీంనగర్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐవైఎస్ఓ టీమ్ ఇండియా, ఏ సిటీ ఇండియా, యంగ్ ఇండియా మిషన్, సార్ – సేఫర్ ఇండియన్ రోడ్స్, కేసీసీ – కరీంనగర్ సైకిల్ క్లబ్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా చేపట్టారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ప్రాంగణంలో ప్రారంభమైన ఈ శిబిరంలో పలువురు యువత రక్తదానం చేశారు. చైతన్య, సయ్యద్ అఫ్జల్ అహ్మద్, మోహన్ కుమార్, జి. సాయి కుమార్ తదితరులు తమ రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేసి, కలాం ఆశయాలకు అంకితంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఐవైఎస్ఓ సీఈవో ఘన్‌షామ్ ఓజా, ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ టెక్నికల్ సూపర్‌వైజర్ పల్లెర్ల రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ పోతరాజు రాజు తదితరులు పాల్గొన్నారు. కలాం జయంతిని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ద్వారా యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించాలన్నది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# సైదాపూర్‌లో కొనుగోలు కేంద్రాల లేకపోవడంతో రోడ్డుపై వరిధాన్యం



**సైదాపూర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖరీఫ్ సీజన్‌లో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో, సైదాపూర్ –మొలంగూర్ రోడ్డుపై రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. వర్షాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితుల్లో, ధాన్యం తడవకుండా కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారింది. కొనుగోలు కేంద్రాల లేకపోవడం వల్ల తమ కష్టాల ఫలితాన్ని రక్షించుకోవడం కష్టమవుతోందని రైతులు వాపోయారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


## కలాం... నీకు సలాం

రాజకీయ పార్టీలకు దూరంగా,
దేశ సేవకు అంకితమై
ఇస్లాం మతంలో పుట్టి,
ఇస్రోను పట్టి, ఎరోస్పేసు ఎరిగి,
రామేశ్వరం తీరం నుంచి
భారత రాజ్యానికి రాజువై నిలిచినావు.

కలలు కనమన్నావు...
కలలను నిజం చేయమన్నావు...
విజ్ఞానవేత్తగా, గురువుగా,
వెనుతిరుగని జీవితంగా నిలిచావు.

నీ జ్ఞానం దేశానికి దీపం,
నీ జీవితం ప్రేరణగా నిలిచి
కలాం... కలకాలం నీకు సలాం!

గంగవరం రామకృష్ణారెడ్డి
(జర్నలిస్టు, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, వనపర్తి)



# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

## ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి అక్టోబర్ 15( నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి పట్టణంలోని క్రీడా ప్రాంగణంలో బుధవారం అండర్ -14, అండర్ -17 బాల, బాలికల కోసం నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ క్రీడలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించిన ఎమ్మెల్యే అనంతరం ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేఘారెడ్డి మాట్లాడుతూ 15 మండలాల నుంచి క్రీడల్లో పాల్గొనడానికి వచ్చిన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలవాలని సూచించారు. ఆటల్లో గెలుపు -ఓటములు సహజమని, ఓటమిని భయపడకుండా పట్టుదలతో ముందుకు సాగితే విజయాన్ని సాధించవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదే గ్రౌండ్లో తన విద్యార్థి దశలో ఆటలు ఆడారని, ఆ



క్రీడా ప్రాంగణాన్ని ఆధునిక క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 50 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అదే ప్రాంగణంలో 15 కోట్ల రూపాయలతో జిమ్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. శ్రీనివాసపురం శివారు 55వ సర్వే నంబర్ల వద్ద క్రీడా పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. వనపర్తిలో క్రికెట్ మైదానం నిర్మాణానికి కూడా అనుమతులు లభించాయని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారిస్తే దేశ -విదేశాలలో వనపర్తి ప్రతిభను చాటవచ్చని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వసతిగృహాల్లో కాస్మోటిక్ ఛార్జీలను పెంచిందని, నాణ్యమైన ఆహారం అందించేందుకు సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని వివరించారు. మొబైల్ ఫోన్ మత్తులో పడకుండా, తమ లక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చీర్ల చందర్, విద్యాశాఖ అధికారులు, క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయంలో నాస్కమ్‌తో అవగాహన ఒప్పందం

**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ సహకారంతో నాస్కమ్ – నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ ఆధ్వర్యంలో ఈ ఒప్పందం కుదరింది. విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలల విద్యార్థులకు "ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్"లో భాగంగా రిస్కిల్, అప్ స్కిల్ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి, పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం రూపొందించబడింది. ప్రతినిధి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ శిక్షణ తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతితో నిర్వహించబడుతుందని, విద్యార్థులు ఆన్లైన్ ద్వారా కొత్త టెక్నాలజీలపై నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు.



పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా, ఎప్పుడైనా – ఎక్కడైనా – నిరంతర స్వీయ అభ్యాసాన్ని ప్రోత్సహించే విధంగా బైట్ సైజ్ మైక్రో లెర్నింగ్ కంటెంట్, అనుభవపూర్వక ప్రాజెక్ట్ ఆధారిత శిక్షణ అందించనున్నారు. 'స్కిల్స్ పాస్‌పోర్ట్', 'స్కిల్స్ వాలెట్', 'బ్యాడ్జ్‌లు' వంటి వినూత్న విధానాల ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడమే కాకుండా, భారతదేశాన్ని డిజిటల్ ప్రతిభ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఫౌండేషన్, డీప్ స్కిల్లింగ్ కోర్సులు (ఉచిత, చెల్లింపు), ఎక్స్‌పీరియన్షియల్ ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్, ఆఫ్‌లైన్ ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్ వంటి ప్రోగ్రామ్‌లు ఇందులో భాగంగా అమలవుతాయి. ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, నాస్కమ్ సంస్థతో మూడు సంవత్సరాల పాటు ఒప్పందం చేసుకున్నామని, దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించగలమని తెలిపారు. కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవి కుమార్ జాస్తి, ప్రత్యేక విధుల్లో అధికారి డాక్టర్ డి. హరికాంత్ పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలకు అంకితంగా పోలీస్ సంస్మరణ వారోత్సవాలు

**కరీంనగర్, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, అక్టోబర్ 20 నుండి 31 వరకు 'పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు'ను ఘనంగా నిర్వహించనున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్నాయి. కమీషనర్ మాట్లాడుతూ, గతంలో విధి నిర్వహణలో భాగంగా కొంతమంది పోలీస్ అధికారులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వారి త్యాగం వల్లే నేడు ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు. ఈ త్యాగాలను ప్రజలందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని, వారి సేవలకు అంకితంగా నిర్వహించే ఈ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పన్నెండు రోజుల పాటు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌తో పాటు అన్ని పోలీస్



స్టేషన్లలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో అమరవీరుల పోస్టర్ల ప్రదర్శనతో ప్రారంభమయ్యే ఈ వారోత్సవాల్లో, అమరవీరుల దినోత్సవ కవాతు, వారి కుటుంబ సభ్యుల సత్కారం, బహుమతుల ప్రదానం వంటి కార్యక్రమాలు ఉంటాయి. పోలీస్ అధికారులకు వ్యాస రచన పోటీలు, విద్యార్థులకు షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, ఆయుధాల ప్రదర్శనలు, షీ టీమ్ అవగాహన, ట్రాఫిక్ నియమాలపై అవగాహన, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ, ప్రజలతో కలిసి సైకిల్ ర్యాలీ, అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశం, వారి సంక్షేమంపై చర్చ, విగ్రహాలకు నివాళులర్పించడం వంటి కార్యక్రమాలు కూడా ఈ వారోత్సవాల్లో భాగంగా ఉంటాయి. హుజురాబాద్ డివిజన్ పరిధిలో విద్యార్థుల కోసం ప్రత్యేక ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, పోలీస్ స్టేషన్ సందర్శన, ఆన్‌లైన్ పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వారోత్సవాల ముగింపు దశలో, రక్తదాన శిబిరం, పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం, చివరగా అక్టోబర్ 31న పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలన్నింటిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, అమరవీరుల త్యాగాలను గౌరవించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ ఆకాంక్షించారు.

# మాడుగుల మండలానికి ఎంపీడీవోగా జి. విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

**మాడుగుల, అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలానికి నూతన ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన శ్రీమతి జి. విజయలక్ష్మి బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో బదిలీపై వెళ్లిన నేపథ్యంలో, కొన్ని నెలలుగా ఇన్చార్జ్ ఎంపీడీవోగా శ్రీ వెజ్జన్న బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పూర్తిస్థాయి ఎంపీడీవోగా జి. విజయలక్ష్మి బాధ్యతలు చేపట్టడం ద్వారా మండల పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగనుంది. విధుల్లో చేరిన అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆమెకు ఘన స్వాగతం లభించింది. ఎంపీవో, ఏపీవో, ఏఇపిఆర్, హౌసింగ్ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సెక్రటరీలు ఆమెను ఆత్మీయంగా ఆహ్వానించారు. మండల అభివృద్ధికి ఆమె నాయకత్వంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆకాంక్షించారు.



# కేరళ ఆస్పత్రిలో కెన్యా మాజీ ప్రధాని మృతి



**ఎర్నాకుళం అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కెన్యా మాజీ ప్రధాని రైలా ఒడింగ .. కేరళలో కన్నుమూశారు. ఎర్నాకుళం జిల్లాలోని కూత్తకూళంలో ఉన్న ఆయుర్వేదిక కంటి ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. క్యాంపస్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో ఆయనకు గుండెపోటు వచ్చింది. ఆయన వయసు 80 ఏళ్లు. ఇవాళ ఉదయం 9 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు శ్రీధరీయం ఆయుర్వేదిక్ ఐ హాస్పిటల్ అండ్ రీసర్చ్ సెంటర్ పేరన్కొన్నది. గత అయిదు రోజుల నుంచి ఆయన ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనతో పాటు ఆయన కుమార్తె, పర్సనల్ డాక్టర్ ఉన్నారు.కెన్యా రాజకీయాల్లో రైలా ఒడింగాకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఆయన 2008 నుంచి 2013 వరకు ప్రధానిగా పనిచేశారు. ఆయుర్వేదిక కంటి ఆస్పత్రిలో గతంలో ఆయన కుమార్తె చికిత్స తీసుకున్నది. ఆమె కంటిచూపు మెరుగైన నేపథ్యంలో అదే ఆస్పత్రిలో మాజీ ప్రధాని ఒడింగా కూడా చికిత్స తీసుకుంటున్నారు. మాజీ ప్రధాని రైలా ఒడింగా మృతి సమాచారాన్ని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్(ఎఫ్ఆర్ఆర్ఓ) ఆఫీసుకు తెలియజేశారు. అయిదుసార్లు ఆయన దేశాధ్యక్ష పదవి కోసం పోటీపడ్డారు. కానీ ఒక్కసారి కూడా నెగ్గలేదు.

# 14 బిలియన్ల డాలర్ల విలువైన బిట్‌కాయిన్ సీజ్ చేసిన అమెరికా



**న్యూయార్క్ అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుమారు 14 బిలియన్ల డాలర్ల విలువైన బిట్‌కాయిన్ ను అమెరికా ప్రభుత్వం సీజ్ చేసింది. ఈ కేసులో కంబోడియాకు చెందిన ప్రిన్స్ గ్రూపు వ్యాపారవేత్తపై అభియోగాలు నమోదు చేశారు. క్రిప్టోకరెన్సీ స్కామ్‌కు సూత్రధారిగా వ్యవహరించినట్లు అమెరికా ఆరోపించింది. యూకే, కంబోడియా జాతీయుడు చెన్ జీపై న్యూయార్క్ కోర్టులో అభియోగాలు మోపారు. బిట్‌కాయిన్ బిజినెస్ ద్వారా మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి అమెరికా, బ్రిటన్ దేశాలు చెన్‌కు వ్యాపార అనుమతులు ఇచ్చింది. కానీ అతనికి చెందిన ఆస్తులను సీజ్ చేసినట్లు యూకే ప్రభుత్వం చెప్పింది. లండన్‌లో ఉన్న 19 ప్రాపర్టీలను సీజ్ చేసింది. వాటి విలువ సుమారు 133 మిలియన్ల డాలర్లు ఉంటుంది. క్రిప్టో చరిత్రలో ఇదో పెద్ద ఆర్థిక నేరమని అమెరికా ప్రాసిక్యూటర్లు తెలిపారు. ఇంత భారీ స్థాయిలో బిట్‌కాయిన్‌ను సీజ్ చేయడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ప్రస్తుతం చెన్ పరారీలో ఉన్నారు. అయితే సైబర్ ఫ్రాడ్ క్రైంలో సూత్రధారి అయిన అతనిపై అమెరికా నిఘా పెట్టింది.

# లొంగిపోయిన 27మంది మావోయిస్టులు



**రాయ్‌పూర్ అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మొత్తం 27మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు బుధవారం ప్రకటించారు. వారిపై మొత్తం రూ.50లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులందరూ క్రియాశీల సభ్యులేనని, వారిలో 17 మంది పురుషులు, పది మంది మహిళలు ఉన్నారని పోలీసులు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఓయం లఖ్ము(53)పై అత్యధికంగా రూ.10 లక్షల రివార్డు ప్రభుత్వం ప్రక టించిందని, అతను హెడ్‌క్వార్టర్ ప్లాటూన్ నెంబర్ 2 సరఫరా బృంద కమాండర్ పదవిలో ఉన్నాడని సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ చవాన్ పేర్కొన్నారు. మిగిలిన వారిలో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.8 లక్షల రివార్డు, ఒకరికి రూ.3లక్షల రివార్డు ఉందని అన్నారు. మరో ఇద్దరు మావోయిస్టులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, తొమ్మిది మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.50 లక్షలు రివార్డు ప్రకటించినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రకటించిన 'ఛత్తీస్‌గఢ్ నక్సలైట్ సరెండర్ రిహాబిలిటేషన్ పాలసీ' పథకంతో ప్రభావితమై వారంతా పోలీసుల ఎదుట లొంగిపోయారని అన్నారు. అక్టోబర్ 10న నారాయణ్‌పూర్ జిల్లాలో 16 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోగా, వారిపై మొత్తంగా రూ.48 లక్షల రివార్డు ప్రకటించారు. అక్టోబర్ 2న వందమందికి పైగా మావోయిస్టులు లొంగిపోయిన సంగతి తెలిసిందే.

# 2040లో చందమామపైకి భారత వ్యోమగామి

## ఇస్రో చీఫ్ నారాయణన్


**న్యూఢిల్లీ అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత అంతరిక్ష రంగ అభివృద్ధి కోసం అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు ఇస్రో చీఫ్ వీ నారాయణన్ తెలిపారు. వాటిలో 80 వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్ల తయారీ, 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రుడిపై అధ్యయనం కోసం వీనస్ ఆర్బిటర్ మిషన్ తయారీ వంటి లక్ష్యాలను ఏర్పరుచుకున్నట్లు వెల్లడించారు. అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , రోబోటిక్స్ , బిగ్ డేటా వంటివాటిని ఉపయోగించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2040లో వికసిత భారత్ దూతగా భారతీయ వ్యోమగామి చందమామపై



అడుగుపెట్టనున్నాడని నారాయణ్ తెలిపారు. 2027లో చేపట్టబోయే మానవసహిత అంతరిక్షయాత్ర మిషన్ ట్రాక్‌లో ఉందని వెల్లడించారు. 2040 నాటికి తొలి మానవసహిత చంద్రయానం చేపట్టాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని.. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు 2027లో ప్రతిష్మాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు ఇస్రో చీఫ్ తెలిపారు. కొన్నేళ్ల క్రితం అంతరిక్షరంగంలో రెండు లేక మూడు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణలపై అధ్యయం కోసం 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ అన్నారు.

# హిందీపై ఉక్కుపాదం.. పాటలు, సినిమాలపై తమిళనాడులో బ్యాన్..!


**న్యూఢిల్లీ అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
త్రిభాషా సూత్రంపై కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ విభేదాల నేపథ్యంలో విద్యా విధానాన్ని మార్చిన సీఎం స్టాలిన్ తాజాగా రాష్ట్రంలో హిందీ భాషకు వ్యతిరేకంగా కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో హిందీ భాషను నిషేధించే లక్ష్యంతో అసెంబ్లీలో ఓ బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదిత చట్టంపై చర్చించేందుకు నిన్న రాత్రి న్యాయ నిపుణులు, ప్రభుత్వం మధ్య అత్యవసర సమావేశం జరిగినట్లు సమాచారం. రాష్ట్రం అంతటా హిందీ హోర్డింగ్‌లు, బోర్డులు, హిందీ సినిమాలు, హిందీ పాటలను నిషేధించే లక్ష్యంతో ఈ బిల్లును రూపొందించినట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. రాజ్యాంగానికి



లోబడే దీన్ని రూపొందించినట్లు సమాచారం. తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని డీఎంకే సహా పలు పార్టీలు ఆరోపిస్తోన్న విషయం తెలిసిందే. తమిళనాడుపై బలవంతంగా హిందీ భాషను రుద్దడానికి వ్యతిరేకంగా ఆ రాష్ట్ర శాసనసభ ఇటీవలే ఓ తీర్మానం చేసింది. అధికార భాషలపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ నివేదికలోని సిఫారసులను అమలు చేయవద్దని ఆ తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. సెప్టెంబర్ 9న రాష్ట్రపతికి ఈ కమిటీ నివేదించిన సిఫారసులు తమిళంసహా ఇతర రాష్ట్రాల భాషలకు, వాటిని మాట్లాడే ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ సీఎం ఎంకే స్టాలిన్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంతోపాటు హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాలకు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఇచ్చిన హామీకి పార్లమెంటరీ కమిటీ సిఫారసులు వ్యతిరేకంగా ఉన్నాయని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. దీన్ని అసెంబ్లీ ఆమోదించింది.

# గ్రీన్ క్రాకర్స్ అమ్మకం, వాడకానికి సుప్రీంకోర్టు అనుమతి

**న్యూఢిల్లీ అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈ ఏడాది దీపావళికి పటాకుల అమ్మకానికి, పేల్చడానికి సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. అయితే ఢిల్లీలో విపరీతమైన వాతావరణ కాలుష్య నేపథ్యంలో నిర్దిష్ట సమయంలోనే.. అది కూడా కేవలం గ్రీన్‌క్రాకర్స్ అమ్మకానికి, వాటి వాడకానికి సుప్రీంకోర్టు బుధవారం అనుమతినిచ్చింది. అక్టోబర్ 18-21 తేదీల్లో జరగనున్న దీపావళి పండుగ సందర్భంగా ఆయా రోజుల్లో ఉదయం 6-7, రాత్రి 8-10 గంటల సమయంలోనే పటాకుల్ని పేల్చడానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఇటు పండుగను, అటు వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమతుల్యత పాటించేవిధంగా కోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ సడలింపు కాలుష్య నియంత్రణ



ప్రయత్నాల్లో ఈ తాత్కాలిక చర్యలు సహకరిస్తాయా అని అంచనా వేయడానికే ఈ ఉత్తర్వు అని భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవారు, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అక్టోబర్ 14-21 వరకు నీటి నాణ్యతను పర్యవేక్షించాలని, ఢిల్లీలోని గాలి నాణ్యతపై పటాకుల ప్రభావాన్ని పరిశీలించాలని, దానికి సంబంధించిన నివేదికను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, రాష్ట్ర బోర్డులను ఆదేశించింది. పర్యావరణ విషయంలో మనం సమతుల్య విధానాన్ని తీసుకురావాలి. పర్యావరణాన్ని కాపాడుకోవడంలో రాజీపడకుండా.. పరిమితమైన చర్యలకు అనుమతిస్తూ ఉండాలి అని సిజెఐ ఈ సందర్భంగా అన్నారు. అక్రమంగా రవాణా చేసిన బాణాసంచా సర్టిఫైడ్ గ్రీన్ బాణాసంచా కంటే చాలా ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుందని సిజెఐ పేర్కొన్నారు. కాగా, గ్రీన్ టపాకులకు అనుమతిని మొదట 2018లో అమల్లోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం టపాకులపై సంబంధించిన కేసులో అర్జున్ గోపాల్ గ్రీన్ క్రాకర్స్‌కి అనుమతినిస్తూ తీర్పునిచ్చారు.

# నేడు ప్రధాని మోదీ సభకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేద్దాం...

-టిడిపి మండల కన్వీనర్ ఎం.గోవిందరెడ్డి...




**ఓర్వకల్లు అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేద్దామని టిడిపి మండల కన్వీనర్ ఎం గోవిందరెడ్డి అన్నారు. ఈనెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాకు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్ పథకంలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామంలోని రాగ మయూరి గ్రీన్ హిల్స్లో బహిరంగ సభకు మోదీ హాజరు కావడం జరుగుతుంది. కావున ఈ బహిరంగ సభకు కూటమి నేతలు ప్రజలు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అంతేకాకుండా మండలానికి దేశ ప్రధాని రావడం చాలా సంతోషదగ్గ విషయమని అలాగే జీఎస్టీ తగ్గడం ఒక్కో కుటుంబానికి 15 చొప్పున చేకూరుస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అల్లా బాబు, శ్రీనివాసులు, నాగభూషణం శెట్టి పాల్గొన్నారు.

# మరోసారి ఉద్యోగులపై వేటు వేయనున్న అమెజాన్

**వాషింగ్టన్ అక్టోబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రముఖ ఇ - కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. హ్యూమన్ రీసోర్స్ (హెచ్ఆర్) విభాగం నుండి 15శాతం సిబ్బందిని




తొలగించనున్నట్లు సంస్థ ప్రకటించింది. హెచ్ఆర్ యూనిట్‌పై తీవ్రంగా ప్రభావం పడనుందని, అయితే ఇతర విభాగాల్లో కూడా ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఫార్చ్యూన్ ఉదహరించిన పలు వర్గాలు తెలిపాయి. ఇటీవల కంపెనీ కన్స్యూమర్ డివైసెస్ గ్రూప్, వండరీ పాడ్‌కాస్ట్ విభాగం మరియు అమెజాన్ వెబ్ సర్వీసెస్ నుండి కొద్దిమంది ఉద్యోగులను తొలగించిన కొన్ని నెలల అనంతరం ఈ చర్య వచ్చింది. అయితే సంస్థ ఎప్పుడు, ఎంత మంది ఉద్యోగులను తొలగించనుంది అన్న వివరాలపై స్పష్టత లేదు. ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) కోసం అమెజాన్ వందకోట్లకు పైగా ఖర్చు చేయడంతో ఈ తొలగింపులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది కంపెనీ 100 బిలియన్ డాలర్లకు పైగా మూలధన పెట్టుబడుల కోసం వినియోగించనున్నట్లు ప్రకటించింది. దీనిలో అత్యధిక భాగం ఎఐ మౌలిక సదుపాయాల కోసం వినియోగించనుంది.